


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :92 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 09 - అక్టోంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad





### హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత.. పలువురు నేతల అరెస్ట్

- హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్.
- లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు
- పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం
- పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఇండియా నెంబర్1: చంద్రబాబు

### భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదు

- ★సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు
- ★ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా
- ★నేను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉంది
- ★ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం




దిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో ఇండియా నంబర్ 1గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదని చెప్పారు. రోడ్ గ్రిడ్ విషయంలో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా దీల్లీలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు. "1895లో సీఐఐ కోల్‌కతాలో

## అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ.. పెండింగ్ అంశాలపై వినతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో



సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన పెండింగ్ అంశాలపై ఈ భేటీలో చర్చించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్రం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావ-నకు వచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అమిత్ షాను ఆయన విజ్ఞప్తి చేశారు. జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఇతర అంశాల పురోగతిపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిపినట్లు సమాచారం. రాష్ట్ర విభజన హామీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంలో కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.




### ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు

- మూడోరోజు మొదలైన నిరసనలు.. రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- "300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం
- నిరసనల వేళ.. జ్ఞానేశ్ కుమార్ నియామకంపై సుప్రీంలో పిటిషన్
- మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు



## మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం: ప్రధాని మోదీ

ఢిల్లీ: భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

- మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం: ప్రధాని మోదీ
- దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు విస్తరించాయన్న మోదీ
- మొబైల్ ఇంటర్నెట్ వేగం 2022తో పోలిస్తే 10 రెట్లు పెరిగిందని వెల్లడి
- డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతిక అంతరాలను తగ్గించామన్న ప్రధాని

## అమరజీవి జలధారకు నిధులు ఇవ్వాలి

### కీలక ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు

- ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ.. పోలవరం, జలధారపై కీలక చర్చ
- ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్న చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని మిగతా 2 లో

### రైతులకు బేడీలా?: కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

### జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు

- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



హైదరాబాద్: పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ మిగతా 2 లో




### వ్యక్తులు కాదు, వ్యవస్థే ముఖ్యం: ఐటీడీపీకి నారా లోకేశ్ దిశానిర్దేశం

- ఐటీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్షా సమావేశం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- వైసీపీ దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపు
- ఐటీడీపీ కమిటీలను త్వరగా నియమించాలని ఆదేశం

అమరావతి: వ్యక్తులు కాదు, వ్యవస్థే ప్రధానమనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఐటీ వింగ్ (ఐటీడీపీ)

## ప్రధాని మోదీ కనుసన్నల్లో ఈసీ అధికారులు పని చేస్తున్నారు

### భవిష్యత్తులో నరేంద్ర మోదీని అధికారంలో నుంచి దించడానికి దారితీస్తుంది

- రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, అమిత్ షాల అసహనానికి నిదర్శనం
- దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోంది
- దేశ ప్రజలను రెండు వర్గాలుగా విభజించేందుకు కేంద్రం ప్రమాదకర క్రీడకు తెరలేపింది
- ప్రధాని మోదీ ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు



న్యూఢిల్లీ: దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం అధికారులు పనిచేస్తున్నా రని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో తప్పు లు చేసిన వారిని వదిలేసి, ఆ తప్పు లను సరిదిద్దాలని డిమాండ్ చేసిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లి కార్జున ఖర్గేలతో పాటు ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం ప్రజా స్వామ్యాన్ని అపహా స్యం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, మిగతా 2 లో

### రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దు




- భారాస ప్రభుత్వ తప్పిదాలతో యాదాద్రి ప్లాంటు ఆలస్యం
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని సరిచేస్తున్నాం
- బొగ్గు సరఫరా లేకుండా ప్లాంటు ఎలా నిర్మిస్తారు?
- విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించబోతు న్నామనే ప్రచారంలో వాస్తవం లేదు
- తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ఇక నుంచి వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానం ఇస్తా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## ‘బిల్డ్ ఏపీ’ నినాదంతో ముందుకు వెళుతున్నాం

అమరావతి: ‘బిల్డ్ ఏపీ’ నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంఓయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు.

### వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు

నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత ప్రగతిలో ఏపీది కీలక పాత్ర: పీయూష్ గోయల్

ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు “టీమ్ ఇండియా”గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. ‘ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష’ అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తులు కాదు, వ్యవస్థే ముఖ్యం
## ఐటీడీపీకి నారా లోకేశ్ దిశానిర్దేశం

అమరావతి: వ్యక్తులు కాదు, వ్యవస్థే ప్రధానమనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఐటీ వింగ్ (ఐటీడీపీ) పనిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఐటీడీపీ ఒక వారధిగా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, సోషల్ మీడియాలో ప్రత్యర్థులు చేసే అసత్య ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఐటీడీపీ కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని లోకేశ్ ఆదేశించారు. విభాగంలోని ప్రతి సభ్యుడిని ‘మై టీడీపీ యాప్’తో అనుసంధానించాలని స్పష్టం చేశారు. పార్టీలోని ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐటీడీపీ మరింత పటిష్ఠంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యనేత చింతకాయల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### డిజిటల్ మౌలిక సదుపాయాల్లో
## ఇండియా నెంబర్1: చంద్రబాబు

దిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో ఇండియా నంబర్ 1గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదని చెప్పారు. రోడ్ గ్రిడ్ విషయంలో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా దిల్లీలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు. “1895లో సీఐఐ కోల్‌కతాలో ఏర్పాటైంది. 1996 ప్రాంతంలో నేను సీఐఐని ప్రమోట్ చేశాను. 1990లో వచ్చిన ఐటీ విప్లవాన్ని నేను అందిపుచ్చుకున్నా. ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. పెట్టుబడిదారులు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే. రియల్ టైమ్‌లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఏపీలో డిజిటల్ హబ్, డేటా సెంటర్లు వస్తున్నాయి. ఇటీవలే రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రారంభించాం. రాష్ట్రంలో సముద్ర తీరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రతి 50 కి.మీ.కు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. పోర్టుల అనుసంధానానికి, కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. పుట్టపర్తిలో డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. అతిపెద్ద రక్షణ తయారీ కేంద్రానికి రాష్ట్రంలో అడుగులు పడ్డాయి. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో రాష్ట్రం నుంచి ఎగుమతులకు చర్యలు చేపట్టాం. పరిపాలనలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు జోడించి సేవలు వేగవంతం చేశాం. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీతో సేవల వేగవంతానికి చర్యలు చేపట్టాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ప్రారంభానికి చర్యలు ప్రారంభించాం. అమరావతిని గ్లోబల్ టెక్ కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం” అని తెలిపారు.

### హైదరాబాద్‌లో ఇండియా కూటమి ‘సేవ్ డెమోక్రసీ’
## ర్యాలీలో ఉద్రిక్తత.. పలువురు నేతల అరెస్ట్

హైదరాబాద్: ‘సేవ్ డెమోక్రసీ’ పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన ‘ఛలో లోక్‌భవన్’ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ‘సేవ్ డెమోక్రసీ’ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

## జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం.. కారణమిదే!

హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక ‘ఎక్స్’ ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం. ఇటీవల ‘చుట్టమల్లే’ పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ‘సౌత్ డిజిటల్ మీడియా’ అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు. వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. “మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి” అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ప్రధాని మోదీ కనుసన్నల్లో ఈసీ అధికారులు పని చేస్తున్నారు

న్యూఢిల్లీ: దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం అధికారులు పనిచేస్తున్నా రని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో తప్పు లు చేసిన వారిని వదిలేసి, ఆ తప్పు లను సరిదిద్దాలని డిమాండ్ చేసిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లి కార్జున ఖర్గేలతో పాటు ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం ప్రజా స్వామ్యాన్ని అపహా స్యం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, అమిత్ షాల అసహ నానికి నిదర్శన మని విమర్శించారు. దేశంలో ప్రతిపక్ష నేతలపై ఇలాంటి దాడులు జరగ డం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అభి వర్ణి ంచారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ.. జంతర్‌మంతర్ వద్దకు బయలుదేరిన రాహుల్, ప్రియాంక తదితరు లను పోలీసులు అరెస్టు చేసి బారఖంబా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేరళ సీఎం వీడీ సతీషన్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలతో కలిసి వారిని కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గేల అరెస్టు దారుణమని మండిపడ్డారు.

ప్రజలను రెండు వర్గాలుగా విభజించే యత్నం

దేశ ప్రజలను రెండు వర్గాలుగా విభజించేందుకు కేంద్రం ప్రమాదకర క్రీడకు తెరలేపిందని సీఎం విమర్శించారు. ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేని పౌరులుగా దేశాన్ని విడగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరి స్తున్నారని, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### ‘సైమన్ గో బ్యాక్’ తరహాలోనే

నాడు స్వాతంత్ర్య పోరాటంలో ‘సైమన్ గో బ్యాక్’ ఉద్యమం ఏవిధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందో, నేడు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ చేస్తున్న ఈ ఆందోళన కూడా భవిష్యత్తులో నరేంద్ర మోదీని అధికారంలో నుంచి దించడానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్‌ను వాడుకుని ఓట్లను తొలగించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అప్రజాస్వామిక విధా నాలపై దీర్ఘకాలిక కార్యాచరణతో పోరాడతా మని, ప్రజలందరినీ ఏకం చేసి ఈ కుట్ర లను మూకుమ్మడిగా తిప్పికొడతామన్నారు.

### మొబైల్ ఫోన్ ఇప్పుడు
## సుపరిపాలనకు సాధనం: ప్రధాని మోదీ

ఢిల్లీ: భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ ‘ఇండియా మొబైల్ కాంగ్రెస్’ (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. ‘మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది’ అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. “2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది” అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో ‘డిజిటల్ విభజన’ ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే ‘డిజిటల్ ఇండియా’ కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ ‘సరిహద్దులు లేని విస్తరణ’ అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

### రైతులకు బేడీలా?
## కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ ఖాతా వేదికగా స్పందించారు. “కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది” అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. “ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?” అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### తెలంగాణలో మండుతున్న ఎండలు..
## పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## అమరజీవి జలధారకు నిధులు ఇవ్వాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ‘జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార’ పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.

### బాలీవుడ్‌లో విషాదం..
## ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

హైదరాబాద్: భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో ‘గమన్’ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ‘పరిందా’, ‘అబ్ తక్ ఛప్పన్’, ‘యశ్వంత్’, ‘వజూద్’ వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత ‘శక్తి: ది పవర్’, ‘అపహరణ్’, ‘టాక్సీ నెం 9211’ వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. ‘వెల్కమ్’ (2007), ‘వెల్కమ్ బ్యాక్’ (2015) చిత్రాలలో ఆయన పోషించిన ‘ఉదయ్ శెట్టి’ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ‘రాజ్‌నీతి’ చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం ‘నటసామ్రాట్’లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా ‘యశ్వంత్’, ‘వజూద్’, ‘ఆంచ్’ వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

### స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు
## కుట్ర జరుగుతోంది: అంబటి రాంబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంబటి ఆరోపించారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి ధ్రువపత్రాలు ఇవ్వొద్దని చెప్పే స్థాయికి చంద్రబాబు, లోకేశ్ దిగజారారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, వెంటనే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. సర్టిఫికెట్లు అందకపోవడం వల్ల నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామని అంబటి హెచ్చరించారు. ఇదే సమయంలో, తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం రెండెకరాల భూమిని కేటాయించిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు నివాసానికి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నా, ఆయన కోర్టును ఆశ్రయించి కూల్చివేతను అడ్డుకున్నారని విమర్శించారు. ఈ అంశంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, నిజాయతీగా ఎన్నికలు జరిగితే కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని అంబటి రాంబాబు జోస్యం చెప్పారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు

ఢిల్లీ: ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసనకు దిగారు. ఆందోళనల్లో భాగంగా తొలుత విపక్ష ఎంపీలంతా కలిసి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. “300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. జంతర్‌మంతర్ వెళ్లాలని ప్రయత్నించాం. కానీ మమ్మల్ని అనుమతించలేదు. మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు. ఆ తర్వాత నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లి నిరసన తెలియజేస్తామని అడిగితే.. మమ్మల్ని ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ఆ నలుగురికి శిక్ష పడటం మీరే చూస్తారు” అని రాహుల్ మాట్లాడారు.

నిరసనల వేళ.. జ్ఞానేశ్ కుమార్ నియామకంపై సుప్రీంలో పిటిషన్

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు.

### సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో
## ఇరికించే ప్రయత్నం..
### డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు

కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్.. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. “నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు” అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు బయటపెట్టలేనన్నారు. “వాళ్లు ఏం మాట్లాడేందుకు వచ్చారు? ఎలా వచ్చారు? ఎవరిని కలిశారు? అన్నీ నాకు తెలుసు. దీని వెనుక ఎవరు ఉన్నారో కూడా తెలుసు” అని శివకుమార్ అన్నారు. ప్రభుత్వ అధికారులను కూడా ఇలాంటి ఉచ్చుల్లోకి లాగవచ్చని హెచ్చరించిన ఆయన.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. తన చుట్టూ మూడు స్థాయిల్లో వ్యక్తులు ఉంటారని, కొందరిని ప్రత్యేకంగా నియమించినట్లు తనకు సమాచారం ఉందని ఆరోపించారు. తనపైనే కాకుండా మరికొందరిపైనా స్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని శివకుమార్ ఆరోపించారు. వాటి వెనుక ఎవరు ఉన్నారు? వాటికి నిధులు ఎవరు సమకూరుస్తున్నారు? అన్న సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మంత్రులను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్లు జరిగే అవకాశం ఉందని ఇటీవల కేబినెట్ సమావేశంలో శివకుమార్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శివకుమార్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హెచ్.డీ. కుమారస్వామి ప్రశ్నలు లేవనెత్తారు. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించి వాటితో వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేయడం కాంగ్రెస్‌కు గతంలోనూ అలవాటేనని ఆరోపించారు. బీజేపీ నేత ఆర్. అశోక్ కూడా శివకుమార్ గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే ఇప్పుడు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

## రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దు

హైదరాబాద్: బొగ్గు సరఫరా లేకుండా యాదాద్రి థర్మల్ ప్లాంటు ఎలా నిర్మిస్తారని, గత భారాస ప్రభుత్వం చేసిన తప్పిదాలతోనే యాదాద్రి ప్లాంటు నిర్మాణం ఆలస్యమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని సరిచేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ఇక నుంచి వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానం ఇస్తామని భట్టి ప్రకటించారు. బుధవారం విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి, విద్యుత్ సంస్థల సీఎండీలు బుద్ధప్రకాష్, కృష్ణభాస్కర్, ముషారఫ్, హరీష్, జితేష్ వి.పాటిల్‌లతో కలసి మీడియాతో మాట్లాడారు. “పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పకుండా ప్రతిపక్షంలో ఉన్నారని భారాస నేత హరీశ్‌రావు ఏదిపడితే అది మాట్లాడటం సరికాదు. రాజకీయ విమర్శల కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రజల్లో అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదు. రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని హరీశ్‌రావుకు చెబుతున్నా. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిన పరిస్థితుల్లోనూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు, సిబ్బందిని ప్రశంసించాల్సింది పోయి కొందరు నాయకులు తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించబోతున్నామని, లిస్టెడ్ కంపెనీలుగా మార్చబోతున్నామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలనే నెహ్రూ విధానం మాది.

బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా నాడు పక్కన పెట్టారు

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు లింకేజీపై గత పాలకులకు ముందుచూపు లేదు. జీ9 గ్రేడ్ రకం బొగ్గు అందుబాటులో లేకపోయినా 2018లో 7 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి కేటాయిస్తామని, మరో 7 మిలియన్ టన్నులు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామని తెలిపారు. 2022 ఏప్రిల్‌లో ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సింగరేణి నుంచే మొత్తం 14 మిలియన్ టన్నులూ సరఫరా చేస్తామని చెప్పారు. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో సిగరేణిలో జీ9 గ్రేడ్ రకం బొగ్గు ఉత్పత్తి కేవలం 1.71 మిలియన్ టన్నులే. అప్పటికే ఉన్న పాత ప్లాంట్లకే అది సరిపోలేదు. మరి 14 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి ఇస్తామని ఎలా ఒప్పందం చేశారు? ఇది వాస్తవమా.. కాదా చెప్పాలని హరీశ్‌రావుకు సవాల్ విసురుతున్నా. యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.6.66 అవుతుంది. ఈ ధర ఎక్కువగా ఉండటంతో తెలంగాణ ప్రజలపైనే ఆర్థికభారం భారం పడుతుంది. ఈ పాపం భారాస పాలకులదే” అని భట్టి విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీలపై హరీశ్‌రావు విమర్శలను విలేకరులు ప్రస్తావించగా భట్టి.. దక్షిణ డిస్కం జితేష్‌ను వివరించాలని మైక్ ఇచ్చారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈఆర్సీ నిర్ణయం తీసుకుందని జితేష్ తెలిపారు.

## వికసిత్ భారత్..
## బంగారు బందరు మా లక్ష్యం ...మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సాధికారత అని, వికసిత్ భారత్, బంగారు బందరు తమ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.మచిలీపట్నంలో బుధవారం ఇంటింటి పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ రెడ్డి హయాంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దుతున్నామని



అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ సహాయ సహకారాలతో అన్ని రంగాల్లో దేశంతో పోటీ పడుతున్నామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ ఉద్యోగాలు, 8 వేల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించామని, పోలవరం, అమరావతి పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు.బందరు పోర్టు మార్చిలో ప్రారంభంపేర్ని నాని లాంటి వారు స్వార్థ రాజకీయం కోసం బందరు పోర్టును గొగులేరుకు తరలించే ప్రయత్నం చేశారని, ప్రజల సహకారంతో పోర్టును సాధించుకున్నామని మంత్రి ఆరోపించారు. గత ఐదేళ్లు పోర్టు పనులు వెనక్కి నెట్టేస్తే, కూటమి ప్రభుత్వ కృషితో వచ్చే మార్చిలో బందరు పోర్టును ప్రారంభించబోతున్నామని చెప్పారు.పోర్టు ప్రారంభానికి ముందే ముఖ్యమంత్రి కృషితో రూ.8,000 కోట్ల పెట్టుబడితో 10,000 మందికి ఉద్యోగాలు కల్పించే గోవా షిప్ యార్డ్ మచిలీపట్నం వచ్చిందని, అందులో యుద్ధ నౌకలు తయారవుతాయని, దానికి అనుబంధంగా మరెన్నో పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. అమృత్ స్కీమ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో బందరులో డ్రైనేజ్ సమస్యను పరిష్కరించామన్నారు.మంగినపూడి తీరంలో పర్యాటక అభివృద్ధికి బీచ్ ఫెస్టివల్, 63 అడుగుల వినాయకుడి విగ్రహ ఏర్పాటుతో దేశ దృష్టిని ఆకర్షించామని, రాబోయే కాలంలో బందరులో రూ.10-15 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, బందరు అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని కొల్లు రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, డిసి యం యస్ చైర్మన్ బండి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని,రాష్ట్ర బ్రహ్మణ కార్పోరేషన్ డైరక్టర్ పీ వీ ఫణి కుమార్. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పామర్రు వీరాంజనేయ కాలనీ వాసులతో కలసి మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ చేసిన పోరాటం ఫలించింది!

నాలుగు నెలల సమస్యకు లభించిన మోక్షం.

యుద్ధప్రాతిపదికన స్పందించి, పనులు ముమ్మరం చేసిన అధికారులు.

మాజీ ఎమ్మెల్యే సహకారంతో అండగా నిలిచిన నాయకత్వం.. కాలనీవాసుల హర్షం!



పామర్రు శ్రీ వార్త న్యూస్:గత నాలుగు నెలలుగా పారిశుధ్యం అధ్వానంగా మారి, తాగునీరు కూడా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పామర్రు లోని వీరాంజనేయ కాలనీ వాసుల సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కాలనీవాసులు తమ హక్కుల కోసం చేసిన నిరంతర పోరాటం, దానికి తోడు స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గారు అందించిన పూర్తి సహకారం మరియు అండదండలతో ఉన్నతాధికారులు ఎట్టకేలేకు స్పందించారు.కదిలిన యంత్రాంగం

### యుద్ధప్రాతిపదికన పనులు:

కాలనీవాసుల ఇబ్బందులపై ఉన్నతాధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు రావడంతో, క్షేత్రస్థాయి అధికారులు తమ నిర్లక్ష్యాన్ని విడనాడి తక్షణమే రంగంలోకి దిగారు. వీరాంజనేయ కాలనీలో యుద్ధప్రాతిపదికన పనులను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.గురువారం నుంచి కాలనీలోని ప్రతి ఇంటికీ తాగునీరు చాలా పుష్కలంగా అందుతుండటంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ముమ్మరంగా సాగుతున్న శానిటేషన్ పనులు:కేవలం తాగునీరే కాకుండా, గత నాలుగు నెలలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది ముమ్మరంగా క్లీనింగ్ పనులు చేపట్టారు. డ్రైనేజీలను పూడికతీసి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా కాలనీ ముఖచిత్రమే మారిపోయింది. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గారికి, తక్షణమే స్పందించి పనులు పూర్తి చేసిన ఉన్నతాధికారులకు వీరాంజనేయ కాలనీ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## బీసీ చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:వెనుకబడిన తరగతుల (బీసీ), కాపు, ఈడబ్ల్యూఎస్ కోటా కింద చిన్నతరహా వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు తక్షణమే ఆర్థిక రుణాలు మంజూరు చేయాలని కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం మచిలీపట్నంలో బీసీ కార్పొరేషన్ ఈడీని కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు సంవత్సరంన్నర క్రితం ప్రభుత్వం ప్రకటించిన పథకాల ఆధారంగా రూ.2 లక్షల నుండి రూ.4 లక్షల వరకు సబ్సిడీ రుణాల కోసం వేలాది మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా బీసీలు, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, రాజులు తదితర వర్గాలకు చెందిన సుమారు 2,000 మందికి పైగా పేదలు రుణాల కోసం ఎదురుచూస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి రుణాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.చిరు వ్యాపారులు, షాపులు నడుపుకునే వారికి ఉపాధి పొందేందుకు ఈ రుణాలు ఎంతగానో తోడ్పడతాయని, కాబట్టి ప్రభుత్వం స్పందించి వెంటనే రుణాలను మంజూరు చేయాలని కోరారు.వినతిపత్రం స్వీకరించిన ఈడీ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగి శివ, కోమటి శ్రీను, పెద్ది సాంబశివ, భోగిరెడ్డి సుభాని, గౌర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలపై దాడి - ప్రజాస్వామ్యంపై దాడీ........ కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:ఢిల్లీలో ఎన్నికల కమిషన్ తీరుకు నిరసన తెలుపుతున్న ఇండియా కూటమి ఎంపీలపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు.బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గత కొంతకాలంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్న తరుణంలో, దీనికి నిరసనగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా ఇండియా కూటమి ఎంపీలు నిరసన తెలియజేస్తుంటే ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం, పోలీసులు పిడిగుద్దులు గుద్దడం మోదీ సర్కార్ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు.13 కోట్ల ఓట్ల తొలగింపు, ఫారం-6 నిబంధనల మార్పు వంటి ఏకపక్ష నిర్ణయాలతో ఎన్నికల సంఘం దేశ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోవడం చరిత్రలో మొదటిసారని, దీనికి మూల పురుషులు మోదీ, అమిత్ షా లేనని విమర్శించారు. వారికి సహకరిస్తున్న జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే మోదీ ఆయన్ను తొలగించాలని డిమాండ్ చేశారు.ప్రతిపక్ష నాయకులపై లాఠీచార్జ్, అరెస్టులు దుర్మార్గమైన చర్యలని, దేశ ప్రజలంతా గమనిస్తున్నారని, మోదీకి కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. దొంగ ఓటర్లతో మోదీ సర్కారు అధికారం చెలాయిస్తోందని ప్రజలు ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేస్తున్నారని, అరెస్టులతో నాయకులను బయటపెట్టలేరని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ వారసత్వం కాంగ్రెస్ పార్టీదని కొడమంచిలి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## ఎయిడ్స్ పై అవగాహన కోసం రాష్ట్ర స్థాయి మారథాన్ రెడ్ రన్ - 2026




విజయవాడ, శ్రీ వార్త న్యూస్:హెచ్ఐవీ, ఎయిడ్స్ పై యువతలో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర స్థాయి మారథాన్ రెడ్ రన్ -




2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్ఎసిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. స్మరణ్ రాజ్ బెలూన్స్ ఎగరవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల సమాజంలో వివక్ష చూపరాదని, హెచ్ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు అనే విషయాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువతను భాగస్వామ్యం చేయడం ద్వారా వారిని హెచ్ఐవీ బారిన పడకుండా కాపాడడమే ఈ రెడ్ రన్ ముఖ్య ఉద్దేశమన్నారు.28 జిల్లాల నుండి పోటీదారులుఈ రెడ్ రన్ కార్యక్రమం ప్రతి జిల్లాలో నిర్వహించి అక్కడ గెలుపొందిన మొదటి ముగ్గురిని రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక చేశారు. రాష్ట్రంలో మొత్తం 28 జిల్లాల నుండి అభ్యర్థులు ఈ మారథాన్ లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని రీజినల్, అనంతరం నేషనల్ స్థాయి మారథాన్ కు పంపిస్తామని అధికారులు తెలిపారు.విజేతల వివరాలు:పురుషుల విభాగం:ప్రథమ బహుమతి (రూ. 35,000):లి ఎం. నరేష్, జీవీడీ డిగ్రీ కాలేజ్, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లాద్వితీయ బహుమతి (రూ. 25,000):లి ఎన్. నిరంజన్, జీవీడీ డిగ్రీ కాలేజ్, పార్వతీపురం మన్యం జిల్లాతృతీయ బహుమతి (రూ. 10,000):లి కె. మణికంఠ, రాజమండ్రి ఆర్ట్స్ డిగ్రీ కాలేజ్, తూర్పు గోదావరి మహిళా విభాగం:లిప్రథమ బహుమతి (రూ. 35,000):లి ఇ. స్వాతి, చీరాల, బాపట్ల జిల్లాద్వితీయ బహుమతి (రూ. 25,000):లి బి. స్పందన, గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కాలేజ్, పార్వతీపురం మన్యంతృతీయ బహుమతి (రూ. 10,000):లి జి. గాయత్రి, బీవీకే జూనియర్ కాలేజ్, విశాఖపట్నంఈ కార్యక్రమంలో ఏపీడీటీ డా. కె. భాగ్యలక్ష్మి, జేడీ ఐఈసీ డా. టి. మంజుల, జేడీ సీఎస్టీ డా. శ్రీనివాస్ వర్మ, జేడీ టీఐ సుకుమార్, ఎన్టీఆర్ జిల్లా డీఎల్టీవో డా. భాను నాయక్, డీఎస్డీవో స్పోర్ట్స్ కె. కోటేశ్వరరావు, టూరిజం ఆఫీసర్ రమేష్, డా. రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఎసిఎస్ సిబ్బంది, జిల్లాల నుండి దిశా సిబ్బంది, పార్టనర్ ఎన్జీవోలు, టీఐ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 52 వ వార్డ్ ఖాదీ కాలనీకి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తా

తిరుపతి పార్లమెంట్ టి.డి.పి.ఇంచార్జి పానబాక లక్ష్మికి వినతి

పత్రం ఇచ్చిన సంస్కార్ రాజేష్



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి:తిరుపతి కార్పొరేషన్ ఎన్నికలలో 3, 52 వ వార్డులలో పోటీచేసే అవకాశం బ్రాహ్మణులకు ఇవ్వాలని తిరుపతి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు సంస్కార్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఈ మేరకు తిరుపతి తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పనబాక లక్ష్మిని కలుసుకొని వినతి పత్రం అందచేశారు.స్థానిక 52 వ వార్డ్ ఖాదీ కాలనికి కూటమి అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని, అలాగే 3 వార్డ్ లో బ్రాహ్మణ అభ్యర్థులను కూటమి అభ్యర్థులుగా నిలబెడితే గెలిచి తీరుతామని సంస్కార్ రాజేష్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో బ్రాహ్మణులకు తప్పనిసరిగా అవకాశం ఇస్తామని గతంలో తమకు చెప్పారని, తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెదేపా మేయర్ అభ్యర్థి విజయానికి తాము గట్టిగా కృషి చేస్తామని సంస్కార్ రాజేష్ ప్రకటించారు.

## మండల పరిషత్‌లకు రూ.1.12 కోట్ల నిధులు విడుదల

సకాలంలో వినియోగించుకోవాలి.......జడ్పీ సీఈవో డా.జె.అరుణ



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను మూడవ త్రైమాసికానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన నిధులను జిల్లా పరిషత్ సీఈవో డా.జె.అరుణ విడుదల చేశారు.ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం - జిల్లా పరిషత్ తలసరి గ్రాంట్ రూ.22,57,924/-, జిల్లా పరిషత్ సీనరిట్ గ్రాంట్ రూ.1,15,48,065/-, సీ జడ్పీ, జడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం రూ.8,35,454/-, మండల పరిషత్ సీనరిట్ గ్రాంట్ రూ.1,12,59,364/- లు అభివృద్ధి పనుల నిమిత్తం విడుదల చేశారు.కావున సదరు నిధులను సత్వరమే సంబంధిత పద్దులకు జమచేసుకుని నిబంధనల మేరకు సకాలంలో ఖర్చు చేయవలసిందిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులను సీఈవో కోరారు. తాగునీటి పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చి ఖర్చు చేయాలని, ఎలోనినా ప్రభావం వలన ఎండ తీవ్రత అధికముగా ఉండుటచే భూగర్భ జలాలు తగ్గుటవలన ముందు జాగ్రత్త చర్యలుగా వేసవి ఎదుర్కొని నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా చూడవలసిందిగా ఆమె కోరారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఫలితాలే కీలకం ... జాయింట్ సెక్రెటరీ వీర బ్రహ్మయ్య





మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఫలితాలే కీలకమని, రీ సర్వే, 22ఏ భూములు, పీజీఆర్ఎస్ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయ జాయింట్ సెక్రెటరీ వి. వీర బ్రహ్మయ్య అన్నారు.గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.రీ సర్వే ప్రభుత్వ ప్రాధాన్యతా అంశమని, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, సమస్యలను తహశీల్దార్ స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ఎంతసేపు పనిచేశారన్నది కాకుండా ఫలితమే ముఖ్యమని స్పష్టం చేశారు.ప్రజల్లో రెవెన్యూ శాఖపై విశ్వాసం పెంచేలా అధికారులు మర్యాదగా వ్యవహరించాలని, బల్క్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్వో శ్రీధర్ రెడ్డి, ఆర్డీవోలు సాంబశివరావు, కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైస్సార్సీపీ పార్టీ బలోపేతమే లక్ష్యం

జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యే



నందిగామ, అక్టోబర్ 8, శ్రీ వార్త:వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నందిగామ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రముఖ నాయకులు గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డా. మొండితోక జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో నేతలు జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశంరానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని జగన్ సూచించినట్లు నేతలు తెలిపారు. వార్డు స్థాయి నుంచి ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు.పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం: షేక్ సుభాని మేస్త్రిఈ సందర్భంగా నందిగామ మైనార్టీ వైఎస్సార్‌సీపీ నేత షేక్ సుభాని మేస్త్రి తదితరులు జగన్‌ను కలిశారు. సుభాని మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ వైసీపీ నేతలు ప్రత్యేక సమావేశం అయ్యారు.

## ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!

మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి

అధిగమించాలి: డా. జి.సమరం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో

విజయవంతంగా మానసిక

ఆరోగ్య కార్యక్రమాలు





విజయవాడ శ్రీ వార్త న్యూస్:మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు





## గన్నవరం విమానాశ్రయంలో ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ డీకే బాలాజి సమీక్ష

### లా అండ్ ఆర్డర్, బందోబస్తుకు అత్యధిక ప్రాధాన్యత -- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

గన్నవరం శ్రీ వార్త న్యూస్:భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14, 15 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, సంబంధిత జిల్లా అధికారులు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించి ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.గన్నవరం విమానాశ్రయంలోని ఇంటర్నేషనల్ టెర్మినల్ వద్ద నిర్వహించిన సమీక్షలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి లా అండ్ ఆర్డర్, పోలీస్ బందోబస్తు, ప్రోటోకాల్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా, వైద్య, ఆహార భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, కమ్యూనికేషన్, విమానాశ్రయ భద్రత తదితర అన్ని అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.రాష్ట్రపతి వెంట వచ్చే ఉన్నతాధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేయనున్న గ్రీన్ రూమ్‌లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏ ప్రాంతంలో ఏ గ్రీన్ రూమ్ ఏర్పాటు చేయాలి, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.గ్రీన్ రూమ్‌లలో అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేసి, వాటిని సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ప్రతి గ్రీన్ రూమ్ మరియు అవసరమైన ఇతర ముఖ్య ప్రాంతాల వద్ద ఫైర్ టెండర్లు, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన పరికరాలను ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని ఫైర్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే విధంగా సిబ్బంది, వాహనాలు అందుబాటులో ఉండాలని, అన్ని ప్రాంతాలను ముందుగానే పరిశీలించి ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన వాహనాల రాకపోకలు, రూట్, పార్కింగ్ తదితర అంశాలను ప్రోటోకాల్, పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఆర్‌టీఓ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాహనాల పార్కింగ్, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.గౌరవ రాష్ట్రపతితో పాటు వచ్చే అధికారులు,సిబ్బంది తదితరులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అవసరమైన ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేయాలని, ఆహార భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చూడాలని సూచించారు.రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అవసరమైన వైద్య బృందాలు, అంబులెన్సులు, అత్యవసర వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.విమానాశ్రయం పరిసర ప్రాంతాలు, గ్రీన్ రూమ్‌లు, పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాల్లో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, తాగునీటి సదుపాయాలను తగినంతగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రాష్ట్రపతి పర్యటన అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు పూర్తి సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.పోలీస్, రెవెన్యూ, ప్రోటోకాల్, ఆర్‌టీఓ, ఏపీసీపీడీసీఎల్, ఫైర్, వైద్య ఆరోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్/పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, కమ్యూనికేషన్ తదితర అన్ని శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు.ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను ముందుగానే పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించాలని, ఎటువంటి అలసత్వానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును ముందుగానే తనిఖీ చేసి, ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షలో గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, ఎయిర్పోర్టు డైరెక్టర్ కె లక్ష్మీకాంతరెడ్డి, విమానాశ్రయ సీఎస్‌వో కె. ధర్మేంద్ర, ఇంటిలిజెన్స్ విభాగం అధికారి చప్పిడి రాజా, జాతీయ రహదారుల సంస్థ పిడి విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్య కిషోర్, ఇతర పోలీస్ అధికారులు, రెవెన్యూ, ప్రోటోకాల్, ఆర్‌టీఓ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి హాజరైన ఎంపీ బాలశౌరి



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు కమిటీకి వివరాలను సమర్పించారు. మంత్రిత్వ శాఖ కార్యకలాపాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు మరియు సంబంధిత అంశాలపై కమిటీ సభ్యులకు అధికారులు వివరణ ఇచ్చారు.

## కరాటే పోటీల్లో నిత్మల పాఠశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి




మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:ఆల్ ఇండియా స్థాయి కరాటే పోటీల్లో మచిలీపట్నం నిర్మల పాఠశాల ఆరో తరగతి 'ఏ' సెక్షన్ విద్యార్థిని చిన్నం నవరత్న జ్యోతి సబ్ జూనియర్స్ విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. 6వ ఆల్ ఇండియా మావాటే--కా--షితో ర్యూ ఓపెన్ ఆన్‌లైన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో 11 ఏళ్ల బాలికల బ్లూ బెల్ట్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు నవరత్న జ్యోతిని అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం



పామర్రు శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం -విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై నిమ్మలూరు అడ్డరోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ న్యాయవాది డి అజయ్ కుమార్ (53)అక్కడక్కడ మృతి చెందాడు.విజయవాడ నుంచి మచిలీపట్నం ద్విచక్రంపై వెళ్తున్న లాయర్ను అదే దిశలో వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. కారులో పయనిస్తున్న ఒకరికి బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.సంఘటన స్థలానికి చేరుకున్న పామర్రు ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వచ్ఛభారత్ మిషన్ పై హరిత రాయబారులకు శిక్షణ




ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ లో భాగంగా ఎక్స్పోజర్ విజిట్ గూర్చి మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామపంచాయతీ నందు 22 గ్రామాలలోని క్లాప్ మిత్రాలకు, షెడ్ మిత్రాలకు చిట్టూర్పు గ్రామపంచాయతీ నందు గల ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డు నందు ఎంపీడీవో దేవిరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరించుట మొదలుకొని తడి చెత్త నుండి వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేసే వరకు విధానం నడీప్ పిట్లు నిర్వహణ పై అవగాహన కల్పించారు . విశ్రాంత ఎంపీడీవో ఈడే మార్కొండేస్వరావు , డిప్యూటీ ఎస్ జి ఎస్ డబ్ల్యూ వై శివ రామ ప్రసాద్ , డిప్యూటి ఎంపీడీవో కే. వెంకటేశ్వరావు మిగతా 22 పంచాయతీల పంచాయతీ అభివృద్ధి అధికారులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించండి సారూ - గ్రామస్తులు వేడుకోలు

-శిథిలావస్థకు చేరిన మల్లాయి చిట్టూరు గ్రామపంచాయతీ భవనం

-కొద్దిపాటి వర్షానికి పెచ్చులు ఉండటం, గోడలకు చెమ్మ రావడం




ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని మల్లాయి చిట్టూరు గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి వర్షం వస్తే చాలు పెచ్చల ఊడి పడటం, గోడలకు చెమ్మ రావడం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి, సిబ్బంది, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు అనేకమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన ప్రయోజనం లేకపోయింది. అసలు పంచాయతీని పట్టించుకునే నాథుడే కరువయ్యాడా ? అంటూ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.




పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ సిబ్బంది కూర్చుని విధులు నిర్వహించటానికి కూడా ఎంతో ఇబ్బందికరంగా ఉందని, వెంటనే నిధులు లభ్యతను బట్టి నూతన పంచాయతీ కార్యాలయం నిర్మించాలని గ్రామస్తులు అధికారులను ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు.

## శక్తి పటాలను అడ్డుపెట్టుకుని గొడవలకు దిగితే క్రిమినల్ కేసులు

### స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు





మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మచిలీపట్నంలో శక్తి పటాల నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శక్తి పటాలను అడ్డుపెట్టుకుని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.బుధవారం మచిలీపట్నం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.శక్తి పటాల పేరుతో వర్గాల మధ్య విభేదాలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అలాంటి వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో చిలకలపూడి సీఐ ఎస్ కె నభి, ఆర్.పేట సీఐ కె. ఏసు బాబు, చిలకలపూడి ఎస్ఐ, మచిలీపట్నం ఎస్ఐలు మరియు శక్తి పటాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేద బాలింతకు ఐసిడిఎస్ భరోసా!







పామర్రు,శ్రీవార్త న్యూస్:పామర్రు పరిధిలో చెత్తకుప్పల వద్ద పసిబిడ్డకు పాలిస్తున్న బాలింత దుస్థితిపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలకు అధికారులు సత్వరమే స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా ఐసిడిఎస్ అధికారులు, స్థానిక సీడీపీఓ గురువారం రంగంలోకి దిగి యానాదుల కాలనీలో సంచార జీవనం సాగిస్తున్న ఆ తల్లిని, పసిబిడ్డను గుర్తించారు.ఆమె మేజర్ అని, ఆధార్ కార్డు కూడా కలిగి ఉందని అధికారులు నిర్ధారించారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన సదరు బాలింతకు, పసికందుకు తక్షణ సాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భిణీలు, బాలింతలకు ఆర్థిక భరోసా ఇచ్చే 'పీఎంఎంవీవై' ) మరియు ఇతర సంక్షేమ పథకాల కింద ఆర్థిక సహాయంతో పాటు, అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం అందేలా చూస్తామని సీడీపీఓ ఏనుగ పుణ్యవతి తెలిపారు. ప్రజా పక్షంలో ప్రసార మాధ్యమంలో వచ్చిన కథనంపై కొన్ని గంటల్లోనే స్పందించి ఆ పేద కుటుంబానికి అండగా నిలిచిన అధికారులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు విద్యుత్ సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేయాలి...
# 25 ఏళ్లుగా మౌలిక వసతులకు దూరం

**చింతకుంట గిరిజన గ్రామంపై అధికారుల నిర్లక్ష్యం.. రోడ్డు, విద్యుత్ కోసం ఎదురుచూపులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అక్టోబర్ 08 ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోత గ్రామపంచాయతీ శివారు చింతకుంట గిరిజన గ్రామంలో సుమారు 40 కుటుంబాలు 25 ఏళ్లుగా నివసిస్తున్నా ఇప్పటికీ కనీస మౌలిక వసతులు అందలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రజాదర్బార్‌లో, ఐటీడీఏ, ఎంపీడీవో కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోయారు. విద్యుత్ సౌకర్యం లేక సాయంత్రం ఆరు గంటల తర్వాత చీకట్లోనే జీవనం సాగించాల్సి వస్తోందన్నారు.గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఇతర విద్యా సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు చదువుకోవాలంటే సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తల్లిదండ్రులు తెలిపారు. వర్షాలు, వరదల సమయంలో పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లడం మరింత ఇబ్బందిగా మారుతోందన్నారు.చింతకుంట గ్రామాన్ని సందర్శించిన సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా గిరిజన గ్రామానికి కనీస రోడ్డు, విద్యుత్, అంగన్‌వాడీ సౌకర్యాలు లేకపోవడం ఆవేదన కలిగించే విషయమన్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.స్థానిక ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్, మండల అధికారులు చింతకుంట గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా కార్యక్రమాలు చేపడతామని సిపిఐ నాయకులు పేరాల శ్రీనివాసరావు తెలిపారు.

## దూదేకులపల్లిలో యువతకు వాలీబాల్ సామగ్రి పంపిణీ

**టీఆర్పీలో యువత భారీగా చేరికలు -- కండువాలు కప్పి ఆహ్వానించిన రవి పటేల్**



భూపాలపల్లి నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ మండలం దూదేకులపల్లి గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ నెట్‌తో పాటు వాలీబాల్‌కు సంబంధించిన క్రీడా సామగ్రిని పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అందజేశారు.దూదేకులపల్లి గ్రామ యువత వాలీబాల్ క్రీడలో చురుకుగా పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ, అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులో లేకపోవడంతో వివిధ టోర్నమెంట్లలో పాల్గొనలేకపోతున్నారని టీఆర్పీ మండల అధ్యక్షుడు మీసాల రాజు, వ్యవసాయ విభాగం అధ్యక్షుడు పింగిడి శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు లక్కాకుల రాకేష్ రవి పటేల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన రవి పటేల్ యువతకు అవసరమైన వాలీబాల్ సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడల్లో మరింతగా రాణించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. దూదేకులపల్లి యువత మంచి క్రీడాకారులుగా ఎదిగి గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామానికి చెందిన పలువురు యువకులు తీన్మార్ మల్లన్న చేస్తున్న రాజకీయ పోరాటానికి మద్దతు తెలుపుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. వారికి రవి పటేల్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలరని, సమాజంలో మార్పు కోసం యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.టీఆర్పీ లక్ష్యాలు, సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న కార్యక్రమాలకు మద్దతుగా తాము కూడా కలిసి పనిచేస్తామని కొత్తగా పార్టీలో చేరిన యువత తెలిపారు. మైనారిటీ యువత కూడా తీన్మార్ మల్లన్నతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా నాయకులు జినుకల శ్రీను, ముదిరాజ్ మోటపోతుల సమ్మయ్య, దూదేకులపల్లి గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

## క్రీడాకారులతో వికృతి ఏఎంసీ చైర్మన్
## క్రీడాకారులకు విక్కుర్తి చేయూత




అవనిగడ్డ అక్టోబర్ 8 శ్రీ వార్త కడప జిల్లా పుల్లంపేటలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న 12వ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందించారు. గురువారం తన కార్యాలయంలో క్రీడాకారులను అభినందించిన ఆయన, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అవనిగడ్డ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-18 విభాగం సెలక్షన్స్‌లో నాగాయలంక మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలువురు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కడప జిల్లా పుల్లంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రయాణం, ఇతర అవసరాల కోసం విక్కుర్తి ఆర్థిక సహాయం అందించారు.

## మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుజాత
## విద్యార్థులు భవిష్యత్ ప్రణాళిక తో ముందుకెళ్లాలి



అవనిగడ్డ అక్టోబర్ 8 శ్రీ వార్తస్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ నందు ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరికీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుజాత అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ జరిగింది ప్రిన్సిపాల్ డాక్టర్. కె .సుజాత మాట్లాడుతూ కళాశాల పట్ల నమ్మకం కలిగి తమ పిల్లల భవిష్యత్తును రూపుదిత్తే అవకాశాన్ని కల్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.కళాశాల క్రమశిక్షణా నియమావళి గురించి విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు డిగ్రీ అర్హతతో పాటు వివిధ సర్టిఫికెట్ కోర్స్ ల ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకునే దిశగా కళాశాల అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె అజయ్ కుమార్ ,ఆర్ అంకారావు ,అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ కు ఘన సన్మానం

ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ కు సత్కారం




అవనిగడ్డ అక్టోబర్ 8 శ్రీ వార్త అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ కు అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో లియాఫీ ఆధ్వర్యంలో గురువారం ఘన సన్మానం జరిగింది. బెంగళూరులో ఇటీవల జరిగిన మూడు రాష్ట్రాల స్థాయిలో బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో ఎల్ఐసి సంస్థ సీఈవో అండ్ ఎండి ఆర్.దొరైస్వామి చేతుల మీదుగా హరిప్రసాద్ సన్మానం అందుకున్నారు. మచిలీపట్నం డివిజన్లో అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ ఉత్తమ పనితీరు కనపరచడం, సెప్టెంబర్ నెలలో అధిక బిజినెస్ చేయటం, ఆనందా పాలసీలు చేయటంలో మొదటి స్థానంలో నిలవడం, జీవన్ రక్ష పాలసీలలో డివిజన్ లో అవనిగడ్డ బ్రాంచ్ మొదటి స్థానంలో నిలవడంతో బీఎం హరిప్రసాద్ ను ఎల్ఐసి సీఈఓ దొరైస్వామి సన్మానించారు. అంతేకాకుండా ఎండి దొరైస్వామి తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసే అరుదైన అవకాశం ఆకుల హరిప్రసాద్ కు లభించింది. ఈ సందర్భంగా గురువారం అవనిగడ్డ బ్రాంచ్ కార్యాలయంలో హరిప్రసాద్ ఘనంగా సన్మానించారు. అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ గా అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు ఏజెంట్లకు అనుక్షణం అందుబాటులో ఉంటూ బిజినెస్ ను పెంపొందించడంలో హరిప్రసాద్ ది ప్రత్యేక శైలి అని ఈ సందర్భంగా అధికారులు, ఏజెంట్లు కొనియాడారు. పూలమాలలు, దుస్సాలువాలతో బ్రాంచ్ మేనేజర్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ బ్రాంచ్ ఉన్నత స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందని, ఎల్ఐసి అధికారులు, ఏజెంట్లు అందరి సమిష్టి కృషితో ఇది సాధ్యమైంది అన్నారు, ఏజెంట్లు కష్టపడి ఎక్కువ బిజినెస్ చేయటంతో బ్రాంచ్ కు గుర్తింపు వచ్చిందనీ, అవనిగడ్డ బ్రాంచ్ ఎప్పుడూ ఉన్నత స్థానంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లియాఫీ నాయకులు మాదివాడ నిరంజన్ రావు, అంబటి వెంకటేశ్వరరావు, డీఓలు రాఘవరావు, రవి, లికా భాషా, కార్యాలయ అధికారులు వాణిశ్రీ, శశి, డీఓ లు, క్లియా ఏజెంట్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సన్మానం
## అవార్డులు సాధించడం అభినందనీయం



అవనిగడ్డ అక్టోబర్ 8 శ్రీ వార్త నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ వసతి గృహాలకు జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు రావటం అభినందనీయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు అందుకున్న మోపిదేవి ఎస్సీ వసతి గృహం సంక్షేమ అధికారిణి యాసం శివ నాగలక్ష్మి, తలగడదీవి బీసీ వసతి గృహం సంక్షేమ అధికారిణి డీ.వెస్లీరాణిలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులకు వసతి గృహాల్లో స్వచ్ఛమైన వాతావరణం, పరిసరాలు నెలకొల్పటం ఆదర్శనీయం అన్నారు. ఈ అవార్డుతో పాటు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి యాసం శివ నాగలక్ష్మి ఇటీవల ఆగష్టు 15 సందర్భంగా జిల్లా బెస్ట్ హెచ్.డబ్ల్యూ.ఓ అవార్డు కూడా అందుకోవటం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఏ.ఎస్.డబ్ల్యూఓ మల్లవరపు విజయ, వసతి గృహం సంక్షేమ అధికారులు ఆవుల భాస్కరరావు, కొక్కిలిగడ్డ నాగార్జున, బండ్రెడ్డి విష్ణు, షకూర్, కే.వెంకటేశ్వరరావు, బీ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు
## కొబ్బరికాయలు పూజ సామాగ్రికి అమ్ముకొనుటకు బహిరంగ వేలం



అవనిగడ్డ అక్టోబర్ 8 శ్రీ వార్త అవనిగడ్డ గ్రామదేవత శ్రీ లంకమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సంవత్సరం పాటు పూజా సామాగ్రి కొబ్బరికాయలు అమ్ముకొనుటకు దేవాదాయ శాఖ అధికారులు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. గతంలో 2 లక్షల 97 వేల 500 రూపాయలు కాగా పాటలు పాటలు ఒక్కొక్కరు 25 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొన్నారు. హెచ్చు పడ్డదారునిగా ఉప్పాల కనకదుర్గ రెండు లక్షల 98 వేల 500 రూపాయలకు పాటను కైవసం చేసుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి సిహెచ్ సుధాకర్ పాల్గొని పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల సభ్యులు వ్యాసం లంకమ్మ మట్టి శివ పార్వతి బట్టు మాధవి సైతం శ్రీనివాసరావు నలకుర్తి రాము తలగడదీవి బాలకృష్ణ ఆశాధులు గ్రామస్తులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

సందేహాలపై ఈ నెల 15 వరకు
దరఖాస్తుల స్వీకరణ,నారాయణపురం
గ్రామసభలో రైతులకు స్పష్టతనిచ్చిన జిల్లా
కలెక్టర్ దివాకర టిఎస్



సత్తుపల్లి ఆర్సి/ అక్టోబర్ 8(:పాత రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూపరిధిలోనినారాయణపురం గ్రామంలో భూ పునఃసర్వే, సీలింగ్ భూముల సమస్యలపై గురువారం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు తమ సమస్యలు, సందేహాలను ఆయన దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ సమగ్రంగా వివరించారు.భూ పునఃసర్వేలో భాగంగా ప్రస్తుతం ఎవరు భూములను సాగు చేస్తున్నారు, వారి ఆధీనంలో ఎంత విస్తీర్ణం ఉందనే వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో నమోదైన





మార్పులు, సీలింగ్ భూముల వివరాలు, పట్టా భూములకు సంబంధించిన వ్యత్యాసాలను పాత రికార్డులతో పోల్చి పరిశీలిస్తామని చెప్పారు.60 ఏళ్లకు పైగా ఉన్న రెవెన్యూ రికార్డులు, పహాణీలు, భూ బదలాయింపు పత్రాలు, పట్టాలు, కొనుగోలు పత్రాలు, సాధారణ విక్రయ ఒప్పందాలు తదితర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భూమి ఎవరి ఆధీనంలో ఉందన్నదే కాకుండా, అది వారికి ఏ విధంగా సంక్రమించింది, ఎవరి నుంచి కొనుగోలు చేశారు, గతంలో ఎవరి పేరుపై నమోదై ఉందనే అంశాలను కూడా పరిశీలించి హక్కులపై స్పష్టత తీసుకువస్తామని పేర్కొన్నారు.వివిధ బృందాలు నిర్వహించిన సర్వే ఆధారంగా పటాలనురూపొందిస్తున్నామని, వాటిని సమన్వయం చేసి నారాయణపురం గ్రామానికి సమగ్ర భూ పటాన్ని సిద్ధం చేస్తామని కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూయజమానికి వారి పేరుపై నమోదైన విస్తీర్ణం, సర్వేలో గుర్తించిన విస్తీర్ణం తదితర వివరాలతో నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.నోటీసులు అందుకున్న రైతులకు భూమి విస్తీర్ణం, హక్కులు, రికార్డులకు సంబంధించి అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకు అభ్యంతరాలు, సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును పాత రికార్డులతో సరిపోల్చి క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు.భూ రికార్డుల్లోని సమస్యల కారణంగా భూములను విక్రయించలేకపోతున్నామని పలువురు రైతులు కలెక్టర్‌కు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తమ వద్ద ఉన్న పాత పత్రాలు, కొనుగోలు వివరాలు, వారసత్వ పత్రాలు, భూ బదలాయింపులకు సంబంధించిన ఆధారాలను అధికారులకు అందించాలని కలెక్టర్ కోరారు.భూ పునఃసర్వే, రికార్డుల పరిశీలనలో ఎలాంటి పక్షపాతానికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న రికార్డులు, ఆధారాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి న్యాయబద్ధమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులు తమ వద్ద ఉన్న సమాచారాన్ని అధికారులకు అందించి సహకరించాలని కోరారు. వారి సహకారంతోనే భూ రికార్డుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపగలమని పేర్కొన్నారు. పునఃసర్వే అనంతరం గ్రామంలోని భూముల వాస్తవ పరిస్థితి, రికార్డులు, పటాలు, హక్కుల వివరాలను అనుసంధానం చేసి స్పష్టమైన భూ రికార్డులు రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఉప కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, సత్తుపల్లి మండల తహసీల్దారుసత్యనారాయణ, గ్రామ సర్పంచులు, సంబంధిత అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మన ఆహారమే మన ఆరోగ్యం



మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం మీద, పాటించే అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఆహారాన్ని ఆకలి తీర్చుకోవటానికి, కడుపు నింపుకోవటానికి మాత్రమే కాదు- ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని తీసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినాలి. ఆరోగ్యంగా ఉంటేనే అన్నీ బాగుంటాయి. ఆరోగ్యకరమైన జీవితం కోసం పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. సరైన ఆహారం అంటే ఆరు రుచులున్న ఆహారం. అంటే దాంట్లో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, ఒగరు ఉండాలి. మనం తినే సహజమైన ఆహారంలో పచ్చడి, కారం, పప్పు దినుసులు, రసం, మజ్జిగ, ఉండాలి. వాటి వల్ల శరీరంలో ప్రతి అవయవ వ్యవస్థలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎలాగంటే సరైన సమయంలో సముపాళ్లలో తయారుచేసుకుని ప్రశాంతంగా కూర్చొని ఆహారం తినాలి. సరిపడా నీరు తాగాలి. రోజులో కనీసంగా ఆరేడు గంటలైనా నిద్రపోవాలి. స్నేహితులతో కలిసి మెలిసి ఆనందాన్ని, బాధను పంచుకోవాలి. పెద్దలను గౌరవించాలి. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది.

### పౌష్టికాహారం ముఖ్యం

పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, తృణధాన్యాలు, నట్స్? వంటివి ఆహారంలో చేర్చుకుంటే ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు లభిస్తాయి. సీజనల్‌గా దొరికే పండ్లు, ఆకుకూరలు తప్పనిసరిగా ఎంతోకొంత మోతాదులో తినాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సకాలంలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలి. రాత్రి భోజనంలో తేలికగా జీర్ణమయ్యేలా సొరకాయ, బీరకాయ, దోసకాయ వంటి కూరగాయలతో చేసిన వంటకాలు తీసుకోవడం మంచిది. పన్నీర్, చిక్కుళ్ళు, బీన్స్, నానబెట్టిన బాదం వంటి వాటిలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. భోజనానికి అరగంట ముందు, ఆ తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, తీపి పానీయాలు, మసాలా పదార్థాలను తీసుకోవటం బాగా తగ్గించాలి. నానబెట్టిన బాదం, జీడిపప్పు, తేనెతో చేసిన క్యారెట్ జ్యూస్‌లు ఆరోగ్యానికి చాలా మంచివి. అన్నం, నీళ్లు, పప్పు, కూర, పాలు, పెరుగు, చక్కర, బెల్లం..ఇలా మన దైనందిన ఆహారంలో భాగమయ్యేలా చూసుకోవాలి. మామిడిలో ఉన్నట్టే బొప్పాయిలోనూ విటమిన్?-ఏ ఉంటుంది. పైగా ఇది ఏడాదంతా దొరుకుతుంది. బాగా పాలిష్ పట్టిన తెల్ల బియ్యం కన్నా దంపుడు బియ్యం మంచివి. ఆకుకూరలు, మొలకెత్తిన ధాన్యాలు.. ఇవన్నీ మంచి పోషకాలనిచ్చేవే. నూనెల నుంచి వచ్చే పోషకాలు, శక్తి- క్యాలరీలు కూడా మన శరీరానికి అవసరం. తినే ఆహారంలో మనకు లభించే క్యాలరీల్లో కనీసం 20 శాతం నూనెల నుంచి రావటం ఎంతైనా అవసరం. నూనెల నుంచి శరీరానికి అత్యవసరమైన కొవ్వు ఆమ్లాలు (ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్) కొన్ని లభిస్తాయి. శరీరంలో కొన్ని జీవక్రియలు సజావుగా జరగాలంటే కొవ్వు తప్పనిసరి. ఎ, బి, ఇ, కె విటమిన్లు కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతాయి. శరీరానికి అన్ని పోషకాలూ అవసరం, కానీ వాటిని మితంగా, సమతులంగా తీసుకోవటం మంచిది. ఆపిల్ తొక్కలోనే పోషకాలు ఎక్కువ. లోపల ఉండేదంతా వట్టి పిండి పదార్థమే. పిండిపదార్థం మనం తినే వరి అన్నం వంటి వాటి నుంచి దండిగానే లభిస్తుంది.

### జీర్ణక్రియ మెరుగుదలకు నీరు దోహదం

మన శరీరానికి నీటి అవసరం కేవలం మనం తాగే నీటి రూపంలోనే కాదు; పండ్లు, కూరగాయలు, అన్నం, చారు, మజ్జిగ.. ఇలా అన్నింటి ద్వారా తీరుతుంది. ఇవికాక రోజు మొత్తమ్మీద 2 నుంచి 2.5 లీటర్ల నీరు తాగితే చాలు. అంతకంటే ఎక్కువ తాగితే శరీరంలోని స్రావాలన్నీ పల్చబడిపోయి వాటి పనిసామర్థ్యం బాగా తగ్గిపోతుంది. ఇలా ఎక్కువగా తాగటం వల్ల జీర్ణ ప్రక్రియ వెనకబడుతుంది. ఒక్కసారే నీళ్లు ఎక్కువగా తాగేస్తే ఎంజైములు వంటివి అన్నీ పల్చబడి, వాటి సామర్థ్యం తగ్గిపోతుంది. ఆహారం తినేటప్పుడు మధ్య మధ్యలో కాకుండా మొత్తం తినటం పూర్తయిన తర్వాత తాగాలి. ఒక్కసారే ఎక్కువగా తాగటం కాకుండా రోజంతా వివిధ సందర్భాల్లో తాగుతుండటం ముఖ్యం.

### ఎండల నుంచి ఉపశమనం ఇలా...

ఎండాకాలంలో మన శరీరం ఎక్కువగా నీరసం, అలసట, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు గురవుతుంది. అధిక ఉష్ణోగ్రతలతో శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత కలగడం సాధారణమే. అందుకే ఈ కాలంలో సరైన ఆహారం తీసుకుంటే శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు.

### డీహైడ్రేషన్ లేకుండా చేసే పండ్లు

పుచ్చకాయ, ఖర్బూజ, మామిడి, ద్రాక్ష వంటి పండ్లు శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, నీటి లోపాన్ని భర్తీ చేస్తాయి. ముఖ్యంగా పుచ్చకాయలో 90 శాతం పైగా నీరు ఉంటుంది. ఇది డీహైడ్రేషన్‌ను నివారించడంలో ఎంతో సహాయపడుతుంది. ఈ పండ్లు శరీరాన్ని చల్లబరుస్తూ, జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుస్తాయి. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం చాలా మంచిది. ఈకాలంలో దొరికే మామిడి కాయలు, పండ్లు తినడం ద్వారా శరీరానికి అదనపు శక్తి వస్తుంది.

### ప్రోబయోటిక్స్‌తో జీర్ణక్రియ మెరుగుదల

ఎండాకాలంలో పెరుగు తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుంది. మధ్యాహ్న భోజనంతో పాటు ఒక గ్లాస్ మజ్జిగ తీసుకోవడం వల్ల వేడి ప్రభావం తగ్గుతుంది.

### ఎనర్జీ డ్రింక్ కొబ్బరినీళ్లు

కొబ్బరి నీళ్లు సహజమైన ఎనర్జీ డ్రింక్. కొబ్బరి నీటిలో పొటాషియం, సోడియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్‌ను అందిస్తాయి. ఇవి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రోజుకు ఒకసారి కొబ్బరి నీరు తాగడం వల్ల అలసట తగ్గి, శరీరం తాజాగా ఉంటుంది.

### శరీరాన్ని చల్లబర్చే కీరదోస, ఆకుకూరలు

కీరదోసలో నీటిశాతం ఎక్కువగా ఉండటంతో పాటు, తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడుతుంది. ఆకుకూరలు కూడా విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉండటం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని సలాడ్ రూపంలో తీసుకోవడం ఉత్తమం. ఇవి తేలికగా జీర్ణమవుతూ, పోషకాలను అందిస్తుంది.

### ఎలక్ట్రోలైట్ డ్రింక్‌గా నిమ్మరసం

ఎండాకాలంలో నిమ్మరసం తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం వస్తుంది. ఇందులో విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నిమ్మరసం, చిటికెడు ఉప్పు, చక్కెర కలిపి తాగితే ఇది ఉత్తమ సహజ ఎలక్ట్రోలైట్ డ్రింక్‌గా పనిచేస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారించడానికి దోహదపడుతుంది.

# లాభాలు ఎలా రాబట్టుకుంటారో ఏమో!

గడిచిన రెండేళ్లుగా ప్రపంచ పారిశ్రామిక, సాంకేతిక రంగాలను సునామీలా చుట్టుముట్టేసిన పదం 'కృత్రిమ మేధ' (ఏఐ). డేటా సెంటర్లు, అధునాతన చిప్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధి కోసం కంపెనీలు బిలియన్ల కొద్దీ డాలర్లను వరదలా పారించాయి. అయితే, ఈ ఏఐ విప్లవం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. గతంలో ఉత్సాహంగా పెట్టిన పెట్టుబడులపై ఇన్వెస్టర్లు, కంపెనీల యాజమాన్యాలు ఆలోచనలో పడ్డాయి. అసలు ఇంతటి భారీ పెట్టుబడులకు తగిన ప్రతిఫలం లభిస్తుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రపంచ మార్కెట్లను వేధిస్తున్నాయి.

### పెరుగుతున్న ఉత్కంఠ

ఏఐ రంగంలో మైలురాయిగా భావించే మైక్రోసాఫ్ట్-ఓపెన్ఏఐ భాగస్వామ్యం ఇప్పుడు అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటోంది. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్ కలయికగా మొదలైన ఈ బంధం వ్యయ నియంత్రణ వద్దకు వచ్చేసరికి అనిశ్చితి ఎదుర్కొంటోంది. అత్యున్నత స్థాయి ఏఐ వ్యవస్థలను నిర్మించడానికి, శిక్షణ ఇవ్వడానికి అయ్యే ఖర్చు అసాధారణంగా ఉంటోంది. ఒకే మోడల్‌ను ఒక్కసారి ట్రైన్ చేయడానికి వందల మిలియన్ల డాలర్లు ఖర్చవుతుండగా రోజువారీ మిలియన్ల కొద్దీ యూజర్ల ప్రశ్నలకు సమాధానమివ్వడం కంపెనీలకు సవాలుగా మారుతుంది. టెక్ దిగ్గజాల వద్ద నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఈ వ్యయం దీర్ఘకాలంలో భారంగా మారుతుందన్న ఆందోళన మొదలైంది.



### మౌలిక సదుపాయాలు..

ఏఐ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన ఒక పెద్ద చిక్కుముడిగా మారింది. ఎన్విడియా, ఏఎండీ వంటి కంపెనీలు ఏటా మరింత శక్తివంతమైన చిప్స్‌ను విడుదల చేస్తున్నాయి. ఇది సాంకేతిక పురోగతికి శుభసూచకమే అయినా, పెట్టుబడి కోణంలో ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోంది. రెండేళ్ల క్రితం వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డేటా సెంటర్లు నేటి ఏఐ అవసరాలకు (విద్యుత్, కూలింగ్ వ్యవస్థ) సరిపోవడం లేదు. మౌలిక సదుపాయాలు అనేవి దీర్ఘకాలిక ఆస్తులు. కానీ ఏఐ హార్డ్‌వేర్ సాఫ్ట్‌వేర్ వేగంతో మారిపోతోంది. దీనివల్ల భారీ పెట్టుబడులు పెట్టిన ఆస్తులు త్వరగా వాడుకలో లేకుండా పోతున్నాయి.

### స్కేలింగ్ లాస్ ఎం ఎకనామిక్ లాస్

ఏఐ అభివృద్ధిలో ఒక ప్రాథమిక సూత్రం ఉంది. అది 'ఎక్కువ డేటా ం ఎక్కువ గణన సామర్థ్యం = మెరుగైన ఫలితం'. దీనినే స్కేలింగ్ లాస్ అంటారు. కానీ, ఇప్పుడు ఆర్థిక పరిమితులు ఈ సూత్రాన్ని అడ్డుకుంటున్నాయి. నమూనాలు పెద్దవి అయ్యే కొద్దీ, వాటి పనితీరులో వచ్చే మెరుగుదల తగ్గుతూ ఖర్చు మాత్రం విపరీతంగా పెరుగుతోంది. దీంతో కంపెనీలు మోడల్ కంప్రెషన్, ప్రత్యేక అప్లికేషన్లపై దృష్టి సారిస్తున్నాయి.

### పెట్టుబడిపై రాబడి ఎప్పుడు?

సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ రంగంలో ఒకసారి ప్రోగ్రామ్ రాస్తే ఎంతమంది వాడుకున్నా అదనపు ఖర్చు నామమాత్రంగానే ఉంటుంది. కానీ ఏఐ అలా కాదు. ప్రతి సెర్చ్, ప్రతి ఇంటరాక్షన్ వెనుక భారీ ఖర్చు ఉంటుంది. దీనిని మానిటైజ్ చేయడం (డబ్బుగా మార్చుకోవడం) ఇంకా ఒక సవాలుగానే ఉంది. సంస్థలకు ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు దీర్ఘకాలికంగా కనిపిస్తుండగా ఖర్చులు మాత్రం తక్షణమే చెల్లించాల్సి వస్తోంది.

### ఆగిపోని విప్లవం

ఏఐ విప్లవం ఆగిపోతుందని దీని అర్థం కాదు. కానీ, ఇది 'అపరిమిత అవకాశాల' దశ నుంచి 'పరిమిత ఆప్టిమైజేషన్' దశకు చేరుకుంటుంది. పెట్టుబడిదారులు ఇప్పుడు కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే చూడటం లేదు, లాభదాయకత కూడా లెక్కిస్తున్నారు.




# ఏఐ వినియోగంలో భారత్ టాప్.. కానీ..



**కొన్ని నగరాలకే పరిమితమైన టెక్నాలజీ**
**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగం తక్కువే**
**ఓపెన్ఏఐ నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ: కోడింగ్, డేటా అనాలిసిస్, సంక్లిష్టమైన రీజనింగ్‌లాంటి అంశాల్లో భారత్ ప్రపంచంలోనే అధునాతన ఏఐ మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని ఓపెన్ ఏఐ ఒక నివేదికలో తెలిపింది. సంక్లిష్టమైన సవాళ్లను పరిష్కరించేందుకు, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఏఐని తరచుగా యూజర్లు వినియోగించుకోవడంలో టాప్ అయిదు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటోందని పేర్కొంది. అయితే, కృత్రిమ మేథ వినియోగం కొన్ని నగరాలకే పరిమితమవుతోందని, గ్రామీణ.. పట్టణ ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. సాటి దేశాలతో పోల్చి చూసినప్పుడు, భారత్‌లో మిగతా ప్రాంతాల కన్నా టాప్ నగరాల్లో ఏఐ వినియోగం 3 రెట్లు అధికంగా ఉంటోందని ఓపెన్ఏఐ తెలిపింది. రిపోర్ట్ ప్రకారం కోడింగ్, డేటా అనలిటిక్స్ వినియోగంలో కూడా భారత్‌కి పటిష్టమైన ర్యాంకింగ్ ఉంది. 2026 ఫిబ్రవరిలో ఓపెన్ఏఐ కోడెక్స్ (కోడింగ్ టూల్) యాప్‌ను ఆవిష్కరించిన రెండు వారాల్లోనే దీని యూజర్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. అయితే, ఈ వినియోగం అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా, ఒకే రకంగా లేదు. అడ్వాన్స్‌డ్ ఏఐ వినియోగంలో భారీగా అంతరాలు ఉంటున్నాయి.

### మరిన్ని విశేషాలు..

మొత్తం ఏఐ యూజర్లలో 50 శాతం మంది టాప్ 10 నగరాల్లో ఉంటున్నారు, ఢిల్లీ ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో ఉంది. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, జర్మనీలాంటి సాటి దేశాలతో పోలిస్తే దేశీయంగా టాప్ నగరాల్లో ఏఐ వినియోగం 3 రెట్లు ఎక్కువగా ఉంటోంది. దేశ జనాభాలో ఈ నగరాల్లో నివసించే వారి సంఖ్య 10 శాతం లోపే ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఏఐ వినియోగం విషయానికొస్తే అంతరం మరింత ఎక్కువగా ఉంటోంది. వెనుకబడిన నగరాలతో పోలిస్తే టాప్ సిటీల్లో డేటా అనాలిసిస్ వినియోగం 30 రెట్ల వరకు, కోడింగ్ వినియోగం 4 రెట్లు, ఏఐ డెవలపర్ (కోడెక్స్) వినియోగం 9 రెట్లు అధికంగా ఉంది. పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కి ఏఐ సామర్థ్యాలు గణనీయంగా ఉన్నప్పటికీ, హైదరాబాద్, బెంగళూరు,, ఢిల్లీ, చెన్నైలాంటి కొన్ని పట్టణ ప్రాంత హబ్‌లలో మాత్రమే అవి కేంద్రీకృతమై ఉంటున్నాయి. విద్య, ఆరోగ్యంలాంటి రంగాల్లో అత్యంత అర్థవంతమైన విధంగా ఏఐ వినియోగం పెరుగుతోంది. విద్య విషయంలో తూర్పు రాష్ట్రాలు ముందుంటున్నాయి. విద్యాభ్యాసానికి సంబంధించిన మొత్తం మెసేజీలు జాతీయ సగటైన 20 శాతానికి మించి అస్సాంలో 22 శాతం స్థాయిలో ఉంటున్నాయి. ఒరిస్సా, మణిపూర్, త్రిపుర, చత్తీస్‌గఢ్‌లలో కూడా దాదాపు ఇదే ధోరణి ఉంది. ఆరోగ్యం విషయంలో జమ్మూ కాశ?మర్, పంజాబ్, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళలాంటి ప్రాంతాల్లో ఏఐ వినియోగం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లో ప్రతి 10 మెసేజీల్లో ఒకటి ఆరోగ్యానికి సంబంధించినది ఉంటోంది. జాతీయ సగటుతో పోలిస్తే ఇది 32 శాతం అధికం. టెక్నాలజీ వినియోగ సామర్థ్యాలు ఎంత విస్తృతంగా అందరికీ అందుబాటులోకి వచ్చాయనే దానిపై భారతదేశపు తదుపరి దశ ఏఐ ప్రస్థానం ఆధారపడి ఉంటుంది. తొలినాటి వినియోగదారుల పరిధిని దాటి ఏఐ ప్రయోజనాలు ఎంత వేగంగా మరింత భారీ స్థాయిలో జనాభాకు అందుబాటులోకి వస్తాయనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ అంతరాలను భర్తీ చేయాలంటే నైపుణ్యాలను పెంపొందించడం, అర్థవంతమైన విధంగా ఉపయోగించుకునేందుకు తోడ్పాటు అందించడం కీలకంగా ఉండనున్నాయి.

# మాక్ యూజర్ల కోసం పెర్ప్లెక్సిటీ 'పర్సనల్ కంప్యూటర్'

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న 'పెర్ప్లెక్సిటీ' టెక్ ప్రపంచంలో మరో సంచలనానికి తెరలేపింది. మాక్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా 'పర్సనల్ కంప్యూటర్' అనే సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను కంపెనీ అధికారికంగా ప్రారంభించింది. ఇది కంప్యూటర్‌లోని ఫైళ్లు, అప్లికేషన్లతో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే ఒక ఏఐ ఏజెంట్ అని కంపెనీ తెలిపింది.

### మల్టీ-మోడల్ ఆర్కెస్ట్రేషన్

ఫిబ్రవరిలో కంపెనీ పరిచయం చేసిన 'పెర్ప్లెక్సిటీ కంప్యూటర్' అధునాతన ఆర్కెస్ట్రేషన్ ఫీచర్లను ఇప్పుడు నేరుగా యూజర్ల పర్సనల్ కంప్యూటర్లలో తీసుకువచ్చారు. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది కంప్యూటర్‌లోని లోకల్ ఫైల్స్, ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లు, వెబ్ కంటెంట్‌ను ఒకే చోట అనుసంధానిస్తుంది. సంక్లిష్టమైన పనులను పూర్తి చేయడానికి ఈ సాఫ్ట్‌వేర్ ఏకకాలంలో మల్టీ ఏఐ ఏజెంట్లను రంగంలోకి దించుతుంది.

### మాక్ మినీతో నిరంతర సేవలు

ఈ సాఫ్ట్‌వేర్ అత్యంత ఆకర్షణీయమైన అంశం దాని 'రిమోట్ యాక్సెస్' సామర్థ్యం. ఒకవేళ మీరు మాక్ మినీలో ఈ సాఫ్ట్‌వేర్‌ను రన్ చేస్తుంటే అది 24/7 అందుబాటులో ఉంటుంది. మీరు ఇంటి బయట ఉన్నప్పుడు కూడా మీ స్మార్ట్‌ఫోన్ ద్వారా వాయిస్ కమాండ్స్ ఇచ్చి మీ కంప్యూటర్‌లోని పనులను పూర్తి చేయవచ్చు లేదా పర్యవేక్షించవచ్చు.

### పర్సనల్ కంప్యూటర్ చేసే పనులు ఇవే..

ఈ ఏఐ అసిస్టెంట్ కేవలం సమాధానాలు చెప్పడమే కాకుండా క్రియేటివ్ పనులను కూడా చక్కబెడుతుంది.

మీ 'టూ-డూ లిస్ట్' సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తుంది. యాపిల్ నోట్స్ లేదా మెసేజెస్ వంటి యాప్‌లను తెరిచి మీకు కావాల్సిన సమాచారాన్ని పంపడం లేదా నోట్స్ సిద్ధం చేయడం వంటివి చేస్తుంది. అస్తవ్యస్తంగా ఉన్న ఫోల్డర్‌లను క్రమబద్ధీకరించడం, ఫైళ్లకు అర్థవంతమైన పేర్లు పెట్టడం వంటి పనులను క్షణాల్లో పూర్తి చేస్తుంది.మొబైల్ నుంచే వాయిస్ ద్వారా పనులను పూర్తి చేసే వెసులుబాటు ఉంది.




### భద్రతే ప్రాధాన్యం

వినియోగదారుల డేటా భద్రత విషయంలో పెర్ప్లెక్సిటీ కఠినమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. 'పర్సనల్ కంప్యూటర్ అప్లికేషన్ అత్యంత సురక్షితమైన 'శాండ్‌బాక్స్' వాతావరణంలో పనిచేస్తుంది. ఇది చేసే ప్రతి చర్యను యూజర్లు పర్యవేక్షించవచ్చు. ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మార్పులు చేసే సదుపాయం కూడా ఉంది' అని కంపెనీ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ 'పర్సనల్ కంప్యూటర్' ఫీచర్ పెర్ప్లెక్సిటీ ప్రో చందాదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వెయిట్‌లిస్ట్‌లో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే సాధారణ వినియోగదారులందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# 2 వారాల పాటు ఈ గింజలను తినండి.. శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి..

చిన్నగా కనిపించే ఒక సూపర్ ఫుడ్ శరీరంలో కేవలం రెండు వారాల్లో మార్పులు తీసుకురాగలదా? అవును, అది చియా గింజల వల్ల సాధ్యమే. పోషక విలువలతో నిండిన ఈ గింజల్లో ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. పరిమాణంలో చిన్నవైనా, ప్రతిరోజూ తీసుకుంటే ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపిస్తాయి. నిపుణుల ప్రకారం, రోజూ ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను 14 రోజుల పాటు తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా శక్తి స్థాయిలు పెరగడం, హృదయ ఆరోగ్యం మెరుగుపడడం వంటి ప్రయోజనాలు పొందవచ్చు. వీటిలో ఉన్న అధిక ఫైబర్ గట్ (జీర్ణ వ్యవస్థ)లో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. అలాగే నీటిని ఎక్కువగా శోషించుకునే గుణం ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది.



### జీర్ణక్రియ మెరుగుపడేందుకు..

అలాగే జీర్ణక్రియ మెరుగుదల విషయంలో చియా గింజలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇవి ద్రవ్యంలో కరిగే ఫైబర్‌ను అధికంగా కలిగి ఉండటం వల్ల నీటిని పీల్చుకుని జెల్ రూపంలో మారుతాయి. దీంతో మలబద్ధకం తగ్గి, క్రమబద్ధమైన విసర్జనకు సహాయపడుతుంది. అంతేకాకుండా, గట్‌లోని మంచి బ్యాక్టీరియాకు పోషణను అందించి జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. అదేవిధంగా హృదయ ఆరోగ్యానికి కూడా చియా గింజలు మేలు చేస్తాయి. వీటిలో ఉన్న ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ద్రవ్యంలో కరిగే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది.

### షుగర్ లెవల్స్ తగ్గేందుకు..

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇవి కీలకంగా పనిచేస్తాయి. చియా గింజలలోని ద్రవ్యంలో కరిగే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మది చేస్తుంది. దీంతో కార్బోహైడ్రేట్ల శోషణ ఆలస్యమై, భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా అడ్డుకుంటుంది. ఇక చియా గింజలను రాత్రంతా నానబెట్టి ఉదయం తీసుకోవడం ఉత్తమం. రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను నీరు లేదా పాలతో కలిపి తీసుకుంటే, వాటి పూర్తి పోషక ప్రయోజనాలను పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

## దసరా సెలవులు.. ఏ రాష్ట్రంలో ఎక్కువో తెలుసా?



న్యూఢిల్లీ: దసరా పండుగ ప్రారంభం కానుండటంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దసరా, దుర్గాపూజ, విజయదశమి, లక్ష్మీపూజ తదితర పండుగల సందర్భంగా వివిధ రాష్ట్రాలలో సెలవులు ఇలా ఉన్నాయి.

ఢిల్లీ: అక్టోబర్ 20న దసరా/విజయదశమి సందర్భంగా పాఠశాలలకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 26న వాల్మీకి జయంతి సందర్భంగా కూడా సెలవు ఉంటుంది.

ఉత్తరప్రదేశ్: అక్టోబర్ 20న దసరా సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

బిహార్: అక్టోబర్ 5న జితియా వ్రతం సందర్భంగా సెలవు ఉంటుంది. దుర్గాపూజ సందర్భంగా అక్టోబర్ 17 నుంచి 21 వరకు పాఠశాలలు మూసివేయనున్నారు.

పశ్చిమ బెంగాల్: అక్టోబర్ 10న మహాలయ/దేవీపక్షం సందర్భంగా సెలవు ఉంటుంది. దుర్గాపూజ, లక్ష్మీపూజ సందర్భంగా అక్టోబర్ 15 నుంచి 26 వరకు పాఠశాలలకు సెలవులు ఉంటాయి.

ఒడిశా, అసోం: దుర్గాపూజ సందర్భంగా అక్టోబర్ 17 నుంచి 21 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

హర్యానా: అక్టోబర్ 20న దసరా, అక్టోబర్ 26న మహర్షి వాల్మీకి జయంతి, అక్టోబర్ 29న కర్వాచౌత్ సందర్భంగా సెలవులు ఉంటాయి.

కర్ణాటక: దసరా సెలవులు అక్టోబర్ 3 నుంచి 21 వరకు కొనసాగనున్నాయి. అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.

తెలంగాణ: అక్టోబర్ 10 నుండి అక్టోబర్ 22 వరకు

ఆంధ్రప్రదేశ్: అక్టోబర్ 12 నుండి అక్టోబర్ 21 వరకు

దేశవ్యాప్తంగా అక్టోబర్ 20న దసరా/విజయదశమి సందర్భంగా పాఠశాలలకు సెలవు ఉంటుంది. అలాగే నవంబర్ 8న దీపావళి/కాళీపూజ సందర్భంగా దేశవ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ఉండనుంది. అయితే పాఠశాలల సెలవుల తేదీలు రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాశాఖల నిర్ణయాల ప్రకారం మారే అవకాశం ఉన్నందున విద్యార్థులు తమ పాఠశాల అధికారిక సెలవుల జాబితాను కూడా పరిశీలించడం మంచిది.

## ఈనెల 16న విశాఖలో వైఎస్సార్‌సీపీ బీసీ గర్జన సభ



విశాఖ: ఉత్తరాంధ్రలో బీసీల గొంతుకను వినిపించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీన విశాఖలో ప్రతి ష్టాత్మకంగా 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ సభ ద్వారా ప్రధానంగా రెండు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పార్టీ నేతలు నిర్ణయించారు. రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు బీసీ వర్గాలను చేస్తున్న మోసాలు, వంచనలను ప్రజల ముందుంచనున్నారు. రాష్ట్రంలో బీసీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలు, భౌతిక దాడులపై ఈ వేదిక ద్వారా తీవ్రంగా గళమెత్తనున్నారు. ఈ గర్జన సభ ద్వారా బీసీ వర్గాలకు అండగా నిలుస్తూ, వారి హక్కుల సాధన కోసం భవిష్యత్తు కార్యాచరణను వైఎస్సార్‌సీపీ ప్రకటించే అవకాశం ఉంది.

## వంగలపూడి అనిత సవాల్ ఏమైంది?: శ్యామల




తాడేపల్లి: కూటమి ప్రభుత్వం.. యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల వేళ గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామన్న చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా పట్టుబడుతున్నాయి. గంజాయిపై ఉక్కుపాదం మోపామంటూ సీఎం చంద్రబాబు సినిమా డైలాగులు చెబుతున్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు టీవీ షోల టీఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. రాష్ట్రంలో ఆడబిడ్డల ఆర్తనాదాలు హోంమంత్రి అనితకు ఏమాత్రం వినిపించడం లేదు. డేగ కన్నులంటూ ప్రచారం చేసుకుంటున్న ఈగల్ విభాగం సాధించిన వాస్తవ ఫలితాలేంటో స్పష్టం చేయాలి" అంటూ శ్యామల నిలదీశారు. "అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయిని లేకుండా చేస్తామన్న హోంమంత్రి సవాల్ ఏమైంది? కూటమి నేతలు ఆడుతున్నది స్ట్రెయిట్ గేమ్ కాదు, యువత భవిష్యత్తును నాశనం చేసే టాక్సిక్ గేమ్. ప్రకాశం జిల్లాలో పోలీసుల కారులోనే గంజాయి, మద్యం బాటిళ్లు దొరకడం అత్యంత సిగ్గుచేటు. గంజాయి రవాణాలో పోలీసుల పాత్రపై ప్రజలు నిలదీస్తున్నా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో గంజాయి, లిక్విడ్ గంజాయి, యాష్ ఆయిల్, ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి." అని శ్యామల ధ్వజమెత్తారు. "హోంమంత్రి చెప్పిన మూడు నెలల డెడ్‌లైన్ తర్వాతే రాష్ట్రంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఆగస్టు 27న గోకవరంలో 75 లక్షల విలువైన 6 లీటర్ల లిక్విడ్ గంజాయి పట్టుబడింది. సెప్టెంబర్ 2న విజయవాడ శివారులో గంజాయి ముఠా దాడిలో కానిస్టేబుల్ గాయపడ్డారు. సెప్టెంబర్ 4న అనకాపల్లిలో 3 కోట్ల విలువైన 600 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 17న విశాఖ పెదగంట్యాడ వద్ద బెంగళూరు నుంచి తెచ్చిన ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడ్డాయి. సెప్టెంబర్ 27న అల్లూరి జిల్లా పెద్దబయలు వద్ద 1.34 కోట్ల విలువైన లిక్విడ్ గంజాయిని పట్టుకున్నారు. సెప్టెంబర్ 28న అనకాపల్లి జిల్లా కోడూరు జంక్షన్ వద్ద 5.5 కోట్ల విలువైన 43 లీటర్ల యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ,,ఈ రోజు విశాఖపట్నంలో 50 గ్రాముల ఎండీఎంఏ, లీటర్ యాష్ ఆయిల్ దొరకడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. హోంమంత్రి సొంత జిల్లాలోనే కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడుతున్నా స్పందించడం లేదు. ఈగల్ వెబ్‌సైట్ లెక్కల ప్రకారమే 2,444 కేసులు, 6,332 అరెస్టులు, 6 లక్షల కిలోలకు పైగా గంజాయి పట్టుబడింది. రాష్ట్రంలో గంజాయే లేదని ప్రచారం చేస్తూ వెబ్‌సైట్‌లో వేల కేసులు ఎలా చూపిస్తున్నారు. ఆపరేషన్ చైతన్య, ఆపరేషన్ గరుడ, సేఫ్ క్యాంపస్ వంటి కార్యక్రమాల వల్ల ఒరిగింది శూన్యం. జగనన్న ప్రభుత్వంలో ఆపరేషన్ పరివర్తన ద్వారా 90 శాతం గంజాయి సాగును సమూలంగా నిర్మూలించాం. నాడు గంజాయి సాగుదారులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందించి ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో అనకాపల్లి కోడూరులో 2 లక్షల కిలోల గంజాయిని ధ్వంసం చేశాం. పరారీలో ఉన్న 712 మంది నిందితుల్లో ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి. పట్టుబడుతున్న డ్రగ్స్ వెనుక ఉన్న ప్రధాన ఫైనాన్షియర్లు, సూత్రధారులను ప్రభుత్వం ఎందుకు పట్టుకోలేకపోతోంది. విద్యాసంస్థలు, హాస్టళ్ల సమీపంలో డ్రగ్స్ విక్రయాలపై నమోదైన కేసుల వివరాలను జిల్లాలవారీగా వెల్లడించాలి. రాష్ట్ర యువతకు కావాల్సింది టీవీ షోల వినోదం కాదు, డ్రగ్స్ ముప్పు నుంచి సంపూర్ణ రక్షణ. డ్రగ్స్‌పై కంటితుడుపు ప్రచారాలు కాదు, పూర్తిస్థాయి సరఫరా నెట్‌వర్క్ నిర్మూలన కావాలి. మంగళగిరి పార్టీ ఆఫీస్ ఆదేశాలను పాటిస్తూ హోంమంత్రి అనిత కేవలం కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారు. విపక్ష నాయకులపై నిందలు వేయడం మాని హోంమంత్రి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డ్రగ్స్ సమస్యను మరింత దిగజార్చింది" అని శ్యామల దుయ్యబట్టారు.

## బీఆర్ఎస్ పోరుబాట..
## ఈ నెల 14న సింగరేణి కార్మిక గర్జన సభ..

హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో సింగరేణి ప్రతిష్ట దిగజారుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతల అవినీతితో సింగరేణికి లాభాలు తగ్గిపోయాయని మండిపడ్డారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు న్యాయమైన వాటా ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో బొగ్గు ప్రొడక్షన్ పెరిగితే, కాంగ్రెస్ నేతల జోక్యంతో సింగరేణిలో ప్రొడక్షన్ తగ్గిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు సింగరేణిని కుంభకోణాల గనిని చేశారంటూ విమర్శించారు. బొగ్గు లేక రాష్ట్రంలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. దీనింతటికీ కారణం కాంగ్రెస్ పాలన. సింగరేణిని కుంభకోణాలు గనిని చేశారు' అంటూ ఆరోపించారు. గురువారం, అక్టోబర్8వ తేదీ తెలంగాణ భవన్‌లో సింగరేణి నేతలతో హరీష్‌రావు సమావేశం నిర్వహించారు. సింగరేణి బొగ్గు నిల్వలు, థర్మల్ పవర్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. సింగరేణి కార్మికుల సమస్యలపై కార్యాచరణను ప్రకటించారు. దీనిలో భాగంగా 14వ తేదీన సింగరేణి కార్మికుల గర్జన పేరుతో భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మిక గర్జన సభకు టిఆర్ఎస్ వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. గతంలో సింగరేణి బొగ్గు గనులను బీఆర్ఎస్ బృందం సందర్శించింది. థర్మల్ పవర్ ప్లాంట్లను బీఆర్ఎస్ బృందాలు ఇప్పటికే సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకున్నాయి. తాజాగా సింగరేణి నేతలతో సమావేశమైన హరీష్.. సింగరేణి సమస్యలపై పోరుబాట పట్టనున్నట్లు తెలిపారు. 14వ తేదీన సింగరేణి కార్మిక గర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# పతకాలు చెప్పే పాఠం



నువ్వా నేనా అన్నట్టు తలపడే క్రీడోత్సవాల్లో కూడా యుద్ధంలో మాదిరే అవతలి పక్షంపై గెలిచి తీరాలన్న తపన, పట్టుదల ఉంటాయి. ఈర్ష్య, అహంకారం వంటివీ అప్పుడప్పుడు కనబడకపోవు. కానీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెప్పినట్టు ప్రపంచాన్ని మార్చే శక్తి, కోట్లాదిమందికి ప్రేరణగా నిలిచే సామర్థ్యం, ప్రపంచ పౌరుల్ని ఒక్కటిచేసే సత్తా క్రీడలకే ఉంటుంది. జపాన్‌లోని నగోయాలో రెండు వారాలు కొనసాగి, ఎన్నో అద్భుతాలు ప్రపంచానికందించిన ఆసియా క్రీడల సంరంభం ఆదివారం ముగిసింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా క్రీడాకారుల తర్వాత పతక విజేతల్లో మన ఆటగాళ్లది నాలుగో స్థానం. 2023నాటి చైనా క్రీడోత్సవాల్లోనూ మన స్థానం అదే గనుక ఫర్వాలేదన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ సంఖ్యరీత్యా ఈసారి తీసికట్టే. గతంలో 28 స్వర్ణపతకాలు గెలుచుకున్న మన దేశం ఇప్పుడు 21కి సరిపెట్టుకోవాల్సివచ్చింది. వెండి పతకాల్లో చూస్తే 38 నుంచి 28కి పడిపోయాం. కాంస్యంలోనూ అంతే. గతంలో వాటి సంఖ్య 41 కాగా ఇప్పుడు 37. షూటింగ్, ఆర్చెరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో అనుకున్న స్థాయిలో స్వర్ణాలు గెలుచుకోలేకపోవటం పెద్ద లోటు. మనం నాలుగో స్థానంలో ఉన్నామన్న మాటేగానీ తొలి ముగ్గురితో పోలిస్తే చాలా దూరంలో ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు 341 పతకాలతో చైనా, 269తో జపాన్, 150తో దక్షిణ కొరియా ఉన్నాయి. గతంలో 107 పతకాలు గెల్చుకున్న మన జట్లు ఇప్పుడు 85కి పరిమితమయ్యాయి. మన క్రీడాకారుల ఎంపిక ఈసారి కొంత కఠినంగానే ఉంది. పతకాలు రాబట్టగలిగేవారినే ఎంపిక చేయాలన్న పట్టుదల కనబడింది. అందుకు నిర్దేశించిన గీటురాళ్లు కూడా చిన్నవేం కాదు. గత క్రీడోత్సవాల్లో, ఆసియన్ చాంపియన్‌షిప్, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఇతర టోర్నీల్లో తొలి ఆరుస్థానాల్లో నిలిచినవారినే జపాన్ పంపాలన్నది అందులో ముఖ్యమైన ది. గతంలో 'సొంత ఖర్చులతో వస్తాం. అవకాశమీయండి' అని అడిగే క్రీడాకారులు... మన్నించిన అభ్యర్థనలూ తక్కువేం కాదు. ఈసారి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అలాంటివారికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటీయరాదన్న కృతనిశ్చయంతో ఉంది. మెరుగ్గా ఆడేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలన్న సంకల్పం మంచిదే. ఇందువల్ల వెళ్లిన క్రీడాకారుల సంఖ్య తగ్గింది. వారిలో ఎక్కువ శాతంమంది మెడల్ రౌండ్ వరకూ వెళ్లగలిగారు. ఎప్పట్లాగే ఇతర ఈవెంట్లతో పోలిస్తే మనకు అథ్లెటిక్స్‌లోనూ, షూటింగ్‌లోనూ ఎక్కువ పతకాలొచ్చాయి. వాటిల్లో కూడా సంఖ్యాపరంగా తగ్గినట్టే. ఆసియా క్రీడోత్సవాలను ఒలింపిక్స్‌కు ముందస్తు పరీక్షలుగా భావిస్తారు. అక్కడ పనితీరునిబట్టే ఒలింపిక్స్‌లో జాతకం ఎలా ఉండబోతోందో చెప్పవచ్చంటారు. చైనా క్రీడోత్సవాలకూ, జపాన్ ఉత్సవాలకూ మధ్య మన దేశం దాదాపు రూ. 98 కోట్లు వ్యయం చేసింది. కానీ సాధించింది చాలా తక్కువే. మనకొచ్చిన స్వర్ణాల్లో కూడా అత్యధికం...అంటే 21లో 13 టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించినవే. సమష్టిగా, సమన్వయంతో ఆడి గెల్చుకోవటం ప్రశంసించదగ్గదే అయినా, ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్స్‌కు చోటుండదు. ఆటగాళ్ల పనితీరు మెరుగుపడిందా లేదా అన్నది చూడాలి తప్ప, పతకాలను చూసి అంచనాకు రాకూడదన్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆదెల్ సుమారీవాలాతో ఏకీభవించటం కొంత కష్టమే. సగం స్వర్ణాలు క్రికెట్, కబడ్డీ, హాకీ వగైరాలకే వచ్చాయి. ఇవన్నీ జట్టు సమష్టి బలాన్ని చాటాయి... నిజమే. కానీ వ్యక్తిగత ఈవెంట్లలో మరింత మెరుగ్గా ఉంటే ఒలింపిక్స్‌కు అది లాభిస్తుంది. అంతర్జాతీయ సందర్భాల కోసం కఠిన నిబంధనలతో క్రీడాకారుల ఎంపిక, శిక్షణ వగైరాలు మంచిదే. కానీ పాఠశాల స్థాయినుంచే ఈ రంగంలో అర్హులైనవారిని గుర్తించి, స్పోర్ట్స్ అథారిటీలు, అకాడెమీలద్వారా వారిని సానబడితేనే జాతీయ స్థాయిలో మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. మన బడుల్లో మంచినీరు, మరుగుదొడ్లువంటి మౌలిక సదుపాయాల కల్పనే అంతంతమాత్రం. అలాంటిచోట క్రీడలకు చోటిస్తారని ఆశించటం దురాశే. ఏదేమైనా ఇప్పుడు బయటపడిన లోటుపాట్లను నిశితంగా గమనించి సరిదిద్దుకుంటే 2028లో జరిగే లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నాటికి, 2030లో జరిగే దోహా ఆసియా క్రీడోత్సవాలనాటికి మన దేశం మరింత ఉన్నత స్థాయికెదుగుతుంది.

# కాంగ్రెస్ ఒంటెత్తుపోకడ



ఎన్నికల సంఘం(ఈసీ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మాటున చేసిన నిర్వాకంపైనా, ఈ విషయంలో మరో ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను బేఖాతరు చేసినట్టు బయటపడిన వైనంపైనా నిరసనలు హోరెత్తుతున్నాయి. ఒకపక్క కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), ఇతర సంఘాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ రోజూ ఆందోళన నిర్వహిస్తుండగా మంగళవారం ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన సుమారు 300మంది ఎంపీలు 9 గంటలపాటు సెంట్రల్ ఢిల్లీలోని పార్లమెంటు నుంచి ఈసీ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్ వరకూ...ఆ తర్వాత ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోనూ ర్యాలీ, ధర్నా నిర్వహించాయి. విపక్షాలన్నీ ఏకంకావటం ఇటీవల కాలంలో ఇది రెండోసారి. వ్యవస్థలు వ్యవహరించే తీరుపై కావొచ్చు, వాటి విధాన నిర్ణయాలపై కావొచ్చు... నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ కర్తవ్యాన్ని విపక్షాలు నిర్వర్తించటం హర్షించదగిందే. కానీ నిరుడు నిరసనల్లో పాల్గొన్న తమిళనాడుకు చెందిన డీఎంకే ఎందుకు దూరమైంది? మధ్యలో కొన్నాళ్లు ఇండియా కూటమితో చెలిమి చేసినట్టే కనిపించిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సైతం ఈసారి ఎందుకు మాయమైంది? ఆ రెండు పార్టీల వైఖరులూ మారడానికి కారణం ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ వ్యవహార శైలే కారణమన్నది రహస్యమేమీ కాదు. ఎక్కడిదాకానో అవసరం లేదు. మంగళవారంనాటి నిరసనలో తొలుత ఉత్సాహంగా పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కొన్ని ఇతర పార్టీలు సైతం మధ్యలో హఠాత్తుగా అలిగి, దానికి దూరం కావటం కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల పర్యవసానమే. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతూ, సంస్థాగతంగా పటిష్టంగా ఉన్న బీజేపీని ఢీకొనటం తనవల్లే సాధ్యమని కాంగ్రెస్ నమ్ముతోంది. మంచిదే. కానీ తాను బాధ్యతాయుతంగా మెలగాలని అది భావించటంలేదు. తమిళనాడు ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామ్యపక్షం డీఎంకేతో కలిసి పోటీచేసి, అది ఓడిపోగానే ప్లేటు ఫిరాయించి ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నాయకత్వంలోని టీవీకేతో చేతులు కలపటం సూత్రబద్ధ రాజకీయమేనా? తమకు మద్దతు పలికే వర్గాల ఓట్లు ఈసీ అక్రమంగా తొలగించటంవల్లే ఓడిపోయామని ఒకపక్క డీఎంకే చెబుతుండగా, మద్దతుగా నిలవాల్సిన మిత్రధర్మాన్ని కాంగ్రెస్ ఎలా విస్మరించింది? ఆప్ విషయంలోనూ అంతే. కేంద్రంలో తన పాలనలోని అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం నుంచి ఆప్ ఆవిర్భవించింది. కాంగ్రెస్‌కు లోలోన ఆ దుగ్ధ ఉంటే ఉండొచ్చు. పైగా ఢిల్లీలోనూ, పంజాబ్‌లోనూ తన వర్గాల ఓట్లే అది కొల్లగొడుతున్నదన్న ఆగ్రహం సరేసరి. అందుకే దాన్ని బీజేపీ--బీ టీంగా చిత్రిస్తోంది. మరి ఆంధ్రప్రదేశ్‌లో తాను చేస్తున్నదేమిటి? అక్కడ ఎన్డీయే కూటమిలోని టీడీపీతో లాలూచీ పడటాన్ని ఎలా చూడాలి? 2024 ఎన్నికలనాటి అవకతవకలపై పార్లమెంటులో రాహుల్ మాటమాత్రంగానైనా ప్రస్తావించారా? ఈ మౌనం సీఎం చంద్రబాబు కోసం కాదా? ఒకపక్క ఇండియా కూటమికి నాయకత్వం వహించే అర్హత తనకే ఉన్నదంటూ ఇలాంటి తెరచాటు వ్యవహారాలు నడపటం అనైతికమని, తన ఏలుబడిలోని రాష్ట్రాల్లో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్న తీరు కూడా ఈ కోవలోకే వస్తుందని అది గుర్తించటం లేదు. మంగళవారంనాటి ఉదంతంలో నిర్వాచన్ సదన్ దగ్గర ధర్నాకు ముందుగా నిర్ణయించుకున్నాక, చెప్పాపెట్టకుండా ఆకాశవాణి ప్రాంగణంలోకి దూసుకెళ్లటం, ఇతర పక్షాలకు చెప్పకపోవటం ఉద్దేశపూర్వకంగా చేసిందేనని టీఎంసీ, ఇతర పక్షాలూ భావించటంలో తప్పేం లేదు. తాను మాత్రమే బీజేపీపై పోరాడుతున్నానన్న అభిప్రాయం కలిగించటానికే ఇలా చేసిందని ఆ పార్టీలు అలిగాయి. ఈ దశలో చీలిక జాడలు కనబడకూడదని మళ్లీ సర్దుకున్నాయి. పుట్టింది కొన్ని నెలలే అయినా...సంస్థాగతంగా పటిష్టంగా లేకున్నా సీజేపీ పిలుపిస్తే వేలకొలదీ జనం రావటమైనా, ఆప్‌లో కొన్నాళ్లు పనిచేయటం మినహా పెద్దగా రాజకీయ నేపథ్యంలేని అభిజిత్ దీప్కేకు జనం నీరాజనాలు పలకడమైనా ఎందుకో రాహుల్ గ్రహించాలి. సూత్రబద్ధమైన రాజకీయానికి కట్టుబడకపోతే తన మాటెలావున్నా, విపక్షాల ఉద్యమస్ఫూర్తి దెబ్బతింటుందని గుర్తించాలి.

# బెట్టుచేయొద్దు సర్!

'అయ్యవారు ఏం చేస్తున్నారంటే... చేసిన తప్పులు దిద్దుకుంటున్నార'ని నానుడి. ఇప్పుడు ఎన్నికల సంఘం(ఈసీ) వాలకం అలాగే ఉంది. ఓటర్ల జాబితాల్లో చాటుమాటుగా, ఏకపక్షంగా తీసివేతలు, కూడికలు చేసిన వైనం బట్టబయలయ్యాక నిరసనలు వేయినాల్కలు చాచి దహిస్తుంటే ఈసీకి కాళ్లూ చేతులూ ఆడటం లేదు. అందుకే కావొచ్చు... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట ఇంతవరకూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో 'మినహాయించిన' ఓటర్లను తిరిగి చేర్చుకోవటానికి 'ప్రత్యేక చొరవ' మొదలెట్టాలని ఆయా ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు(సీఈఓ) గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలిచ్చింది. ఈ 'ప్రత్యేక చొరవ' కోసం ఫామ్--6ను ఉపయోగించాలని కోరింది. నిజానికిది సాంకేతికంగా చెల్లదు. తొలిసారి ఓటర్ల కోసం నిర్దేశించిన ఫామ్‌ను తొలగించిన ఓటర్లకు ఎలా వినియోగిస్తారు? వారిని చేర్చదల్చుకుంటే అందుకు మరో నిబంధనేమైనా ఉందేమో అన్వేషించాలి. లేదా 'సర్'కు ముందున్న ఓటర్ల జాబితాను యధాతథంగా ఆమోదించాలి. మరో ఆసక్తికరమైన విషయమేమంటే... 2002నాటి 'సర్'లో ఉన్న తండ్రి/తల్లి/ తాత వగైరాలతో అనుసంధానం అయితేనే ఓటు ఉంటుందన్న ఫామ్--6 సవరణకు పూర్తిగా స్వస్తి చెప్పారు. అంతేకాదు... ఇంటింటికీ వెళ్లి ఓట్లను విచారణ చేసుకుంటారట. ఎంత వినయం! ఎంత రాజ్యాంగ విధేయత!! ఇదంతా ఇన్నేళ్లుగా ఎటు పోయినట్టు? 'చూస్తూ ఊరుకుంటే మేస్తూ పోయింద'న్నట్టు ఈసీ సాగించిన ఈ తెరచాటు వ్యవహారాలు తెలియక 13 కోట్లకుపైగా జనం మౌనంగా ఈతిబాధలు అనుభవిస్తుంటే ఈసీ దాన్ని చేతగానితనంగా తీసుకుంది. అసలు ఈసీ రాజ్యాంగాతీత శక్తి కాదనీ, నిబంధనలు బేఖాతరుచేసి దానికదే ఏ నిర్ణయమూ తీసుకోవటం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. ఫామ్--6 సవరణపై తాజాగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యానం దిగ్భ్రాంతిలో పడేసింది. ఆ మార్పును సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించిందంటూ ఈసీ చెప్పడాన్ని ప్రస్తావించి, తాము ఏ సవరణకూ ఆమోదం తెలపలేదని ఒక కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వివరణనిచ్చారు. ఇదే వ్యవహారంపై ఆ ముందురోజే సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానిస్తూ 'ఓటు హక్కు పౌరసత్వానికి అసలైన ప్రాణం. దాన్ని తొలగించటం రాజ్యాంగద్రోహం' అనటం గమనించదగింది. ఇవి చాలు...ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణం నిష్క్రమించడానికి! ఆ పదవిలో ఉండే నైతిక హక్కు ఆయన కోల్పోయారు. గాంధీ జయంతినుంచి ఢిల్లీ, ముంబైవంటి నగరాల్లో జ్ఞానేశ్ తప్పుకోవాలంటూ యువత రోడ్లపైకొస్తున్నారు. పోలీసులు రోజూ యాతన పడుతున్నారు. ఆడ, మగ తేడా పాటించకుండా పోలీసు వ్యాన్లలోకి ఈడ్చుకెడుతున్నారు.




ఒక మహిళా జర్నలిస్టుపట్ల ఏసీపీ స్థాయి వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన వైనం వీడియో సాక్షిగా బయటికొచ్చింది. తప్పు మీద తప్పు చేస్తూ కోట్లాదిమంది ఓటుకు ఎగనామం పెట్టిన పెద్దమనిషి మాత్రం తనను కానట్టు వ్యవహరిస్తున్నారు. నేరం బయటపడ్డాక స్వచ్ఛందంగా తప్పుకోవాల్సింది పోయి, యువఘోష మిన్నంటుతున్నా బధిరాంధత్వం సంప్రాప్తించినట్టు ఆయన ఉండటం మన ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటు. 'సర్' ప్రక్రియలో ఓట్ల తొలగింపు అక్రమాలేమిటో ఇప్పుడు కర్ణాటక, తెలంగాణల్లో బయటపడిన వ్యవహారాలు చెబుతున్నాయి. ఫలానా ఓటు తొలగించమని దరఖాస్తులు అందిందే తడవుగా అడ్డగోలుగా తీసేశారని వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 'సర్' ప్రక్రియలో చోటుచేసుకున్న చట్టవిరుద్ధతలు, వాటి పర్యవసానాలపై ఆందోళన సాగుతోంది. మరి 2024నాటి ఎన్నికలనుంచీ చోటుచేసుకున్న అక్రమాల మాటేమిటి? చట్టం ఆసరావున్నా మిగతా ఇద్దరు కమిషనర్లూ ఎందుకు అడ్డుకోలేకపోయారు? ఆంధ్రప్రదేశ్ వరకూ తీసుకుంటే అప్పట్లో 3,500 పైగా పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి దాటాక లక్షలమంది ఎలా ఓట్లెలావేశారు? ఆ ప్రక్రియకు సంబంధించిన వీవీప్యాట్‌లూ, సీసీ టీవీ ఫుటేజ్‌లూ నిబంధనల్ని కాదని ముందే ఎందుకు తొలగించారు? ఎవరి ఆదేశాల పర్యవసానమిది? ఇవన్నీ తేలాలిప్పుడు. దానికి ముందు, బెట్టుచేయటానికి ఇక స్వస్తిపలికి జ్ఞానేశ్ తక్షణం వైదొలగాలి.

# ఏడు పదుల వయసులోనూ చెక్కుచెదరని కలం

ఉత్తమ జర్నలిస్టుగా ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులుకు అరుదైన గౌరవం.

జర్నలిస్టులు కరిగిపోతూ వెలుగునిచ్చే కొవ్వొత్తులు...ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు

ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు నాకు కేవలం గురువు మాత్రమే కాదు, నాకు ఆదర్శం. స్ఫూర్తి ప్రదాత.... కూరేటి సతీష్









విజయవాడ శ్రీ వార్త బ్యూరో::నాలుగు దశాబ్దాలకు పైగా పాత్రికేయ రంగంలో తన కలాన్ని ఆయుధంగా మలచి, అధికారంలో ఉన్నది ఎవరైనా సరే ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం సాగించిన సీనియర్ పాత్రికేయుడు, ఆధ్యాత్మికవేత్త ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులుకు అరుదైన గౌరవం దక్కింది. విజయవాడ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక ఆత్మీయ సన్మాన సభలో ఆయనకు "ఉత్తమ జర్నలిస్టు" అవార్డును ఘనంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్. దంపతులను రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ఎడిటర్లు, సీనియర్ జర్నలిస్టులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## జర్నలిస్టులు కరిగిపోతూ వెలుగునిచ్చే కొవ్వొత్తులు



అవార్డు స్వీకరించిన అనంతరం ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు మాట్లాడుతూ తనను ఎంతో ఆవేశంతో మాట్లాడించారు. "నేటి రోజుల్లో పత్రికా విలేకరి బతుకు ఎంతో కష్టతరం. ఎన్నో సవాళ్లు, ఎన్నో ఒత్తిళ్లు, ఎన్నో ప్రలోభాల మధ్య నిజాన్ని నిర్భయంగా రాయడం అంటే మాటలు కాదు. అయినా మేము కరిగిపోతూ సమాజానికి వెలుగునిచ్చే మహోన్నతులం. ఒక కొవ్వొత్తి తాను కరిగిపోతూ చుట్టూ ఉన్న చీకటిని పారద్రోలుతుంది. జర్నలిస్టు కూడా అంతే" అని భావోద్వేగంగా అన్నారు.అదే సమయంలో పాత్రికేయుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ విషయంలో అన్ని విధాలా సహకారం అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆయన నాకు ఆదర్శం, స్ఫూర్తి ప్రదాతశ్రీ వార్త ఎడిటర్ కూరేటి సతీష్ మాట్లాడుతూ "ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు నాకు కేవలం గురువు మాత్రమే కాదు, నాకు ఆదర్శం. నేను పాత్రికేయ రంగంలోకి వచ్చిన కొత్తలో ఆయన రాసిన ఎన్నో సంచలన కథనాలు చదివి స్ఫూర్తి పొందాను. ప్రజా సమస్యలపై పోరాటమే ఆయుధంగా రాజీలేని పోరాటం సాగించడం ఆయన నైజం. అధికారులు తప్పు చేస్తే ఎంతటి వారైనా వదిలేవారు కాదు. అలాంటి వ్యక్తికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు రావడం నిజంగా గర్వకారణం" అని అన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు..

సీనియర్ జర్నలిస్ట్, పలు ప్రత్యేక అవార్డుల గ్రహీత అన్నవరపు బ్రహ్మయ్య తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. "నేను మచిలీపట్నం ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేసిన కాలంలో మిత్రుడు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు కృష్ణా జిల్లా బంటుమిల్లి విలేకరిగా పనిచేశారు. అప్పుడు బంటుమిల్లి లాంటి మారుమూల ప్రాంతం నుండి కూడా రాష్ట్ర స్థాయి వార్తలు రాసి పత్రికా రంగానికి మంచి గుర్తింపు తెచ్చారు. నేను ఎంతో పని ఒత్తిడి మీద ఉన్నా, ఎస్.ఎస్.ఆర్.కు జరుగుతున్న సన్మానం యావత్ పత్రికా రంగానికి జరుగుతున్న సన్మానంగా భావించి తప్పకుండా హాజరు కావాలని వచ్చాను" అని చెప్పారు.

## 70 ఏళ్లలోనూ తగ్గని రాత వేగం - వయసు కొలబద్ద కాదు

సీనియర్ పాత్రికేయులు, ఆధ్యాత్మిక సేవకులు మామిళ్లపల్లి శివాచార్య ఫణి కుమార్ శర్మ మాట్లాడుతూ "బంటుమిల్లి ఈనాడు విలేకరిగా ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు ఎన్నో సంచలనమైన వార్తలు రాశారు. ప్రజల గోడును అక్షరాల్లో చూపించారు. నేడు 70 ఏళ్ల వయస్సులో కూడా అదే ఒరవడితో, అదే వేగంతో వార్తలు రాస్తున్నారు. జర్నలిస్టుకు వయస్సు కొలబద్ద కాదని ఆయన నిరూపిస్తున్నారు. ఆయన కలం ఇంకా పదునుగానే ఉంది" అని ప్రశంసించారు.

## ఆధ్యాత్మిక రంగంలోనూ నిష్ణాతుడు

సన్ ఫ్లవర్ న్యూస్ విజయవాడ బ్యూరో పాములపర్తి ప్రభాకరరావు మాట్లాడుతూ "ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులుతో నాకు కేవలం రెండు సంవత్సరాల పరిచయమే ఉంది. కానీ ఈ రెండేళ్లలోనే ఆయన తెలుగు ఉభయ రాష్ట్రాల్లో ఎంత మంచి గుర్తింపు పొందారో అర్థమైంది. పాత్రికేయుడిగానే కాదు, ఆధ్యాత్మిక రంగంలో కూడా ఆయన నిష్ణాతులు. అన్ని దేవాలయాల చరిత్రను పుస్తక రూపంలో భక్తులకు తెలియజేసి ఎంతో సేవ చేస్తున్నారు" అని కొనియాడారు.

## కన్నుల పండువగా సత్కారం

అనంతరం వేదికపై ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఆయన సతీమణి శ్రీమతి జానకీ లక్ష్మి దంపతులను పూలమాలలతో, శాలువాలతో




ఘనంగా సత్కరించారు. సన్ ఫ్లవర్ న్యూస్ విజయవాడ బ్యూరో పాములపర్తి ప్రభాకరరావు దంపతులకు పూలమాల వేసి శాలువాలతో సత్కరించగా, ఎడిటర్లు, జర్నలిస్టులు వరుసగా శాలువాలు కప్పి గౌరవించారు.ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు, పలు ప్రత్యేక అవార్డుల గ్రహీత అన్నవరపు బ్రహ్మయ్య, కానుక దినపత్రిక ఎడిటర్ సత్తిరాజు మల్లికార్జునరావు, శ్రీ వార్త ఎడిటర్ కూరేటి సతీష్, సన్ న్యూస్ విజయవాడ బ్యూరో పాములపర్తి ప్రభాకరరావు, సీనియర్ పాత్రికేయులు మామిళ్లపల్లి శివాచార్య ఫణి కుమార్ శర్మ, విజయవాడ బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ అధికారి శంకర మల్లికార్జున శర్మ, సీనియర్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మదన నవీన్ రెడ్డి, హైదరాబాద్ "అర్చక రత్న" శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

350 మంది నూతన పోలీస్ కానిస్టేబుళ్లకు బేసిక్ లైఫ్ సపోర్ట్ మరియు సీపీఆర్ నందు శిక్షణ







విజయవాడ, అక్టోబర్ 8, శ్రీ వార్త న్యూస్:అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రాథమిక ప్రాణరక్షణ (బీఎల్ఎస్), గుండె-శ్వాస పునరుజ్జీవన (సీపీఆర్) విధానాలపై విజయవాడలోని 350 మంది నూతనంగా నియమితులైన పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.విజయవాడ పోలీస్ కమిషనర్ శ్రీ ఎస్.వి. రాజశేఖర బాబు మరియు ట్రాఫిక్ డీసీపీ శ్రీమతి షిరీన్ బేగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ కార్తికేయన్ జంపాల 350 మంది నూతన పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రాథమిక ప్రాణరక్షణ, గుండె-శ్వాస పునరుజ్జీవన విధానాలపై శిక్షణ అందించారు.ఈ సందర్భంగా ఆకస్మికంగా గుండె ఆగిపోవడం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణమే అందించాల్సిన ప్రాణరక్షణ చర్యలను డాక్టర్ కార్తికేయన్ జంపాల వివరించారు. గుండె-శ్వాస పునరుజ్జీవన విధానం, ఛాతీపై ఒత్తిడి చేయడం, అత్యవసర సమయంలో తక్షణం స్పందించే విధానం వంటి అంశాలను ప్రాయోగికంగా శిక్షణ ఇచ్చారు.పోలీసులు ప్రజలకు అత్యంత చేరువగా పనిచేసే సిబ్బంది కావడంతో, వారికి ఇటువంటి ప్రాణరక్షణ నైపుణ్యాలను అందించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందేలోపు ప్రాణాలను కాపాడే అవకాశం మరింత పెరుగుతుందని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బందిలో అత్యవసర వైద్య పరిస్థితులపై అవగాహన పెంపొందించడంతో పాటు, ఆపద సమయంలో తక్షణ స్పందనకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీఎస్ఆర్ (సామాజిక బాధ్యత) కార్యక్రమంలో భాగంగా పౌరులకు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఉద్యోగులకు, విద్యార్థినీలు మరియు విద్యార్థులకు నిరంతరం శిక్షణ ఇస్తున్నారు.

# విద్యార్థులకు అన్నదానం

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

ముఖ్య అతిథిగా హాజరైన జంపాన శ్రీనివాస్ గౌడ్




ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్:లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ దినవాహి ప్రసాద్ నేతృత్వంలో సుందరంపేట 2వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థులకు భోజనం అందించారు.దినవాహి ప్రసాద్ తండ్రి ఇదే పాఠశాలలో రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌గా సేవలందించారు.ఆయన జ్ఞాపకార్థం ప్రతి నెలా పాఠశాల విద్యార్థులకు భోజనంతో పాటు స్వీట్లు, పండ్లు అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జంపానా శ్రీనివాస గౌడ్ హాజరై లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి విద్యార్థులకు భోజనం వడ్డించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ప్రెసిడెంట్ ఎం.కె. బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు నల్లా శ్రీనివాస్, ఇస్మాయిల్, ట్రెజరర్ డాక్టర్ రాంబాబు, బేతపూడి జోగేశ్వరరావు, కొల్లి సత్యనారాయణ రెడ్డి, వెల్లంకి. కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులకు భోజనం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటిన లయన్స్ క్లబ్ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాలకు లాటరీ....జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ శ్రీ వార్త న్యూస్:జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026-27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 (తేదీ: 24.09.2026)వ తేదీన జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.



దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు.కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఎన్టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు.

## స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ శ్రీ వార్త న్యూస్:ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా




స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. గౌరవ రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గౌరవ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001